# ప్రజాపక్షం
## జిల్లా అనుబంధం
నల్లగొండ సూర్యాపేట యాదాద్రి

బుధవారం | 09 జులై , 2025 | పేజీలు : 08




వివరాలు మెయిన్‌లో

**9న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెకు సిపిఐ సంపూర్ణ మద్దతు**

# ఆయకట్టు రైతుల్లో ఆశలు...

### శ్రీశైలం జలాశయం నుంచి సాగర్ కు నీటి విడుదల...
### 531 అడుగులు చేరిన సాగర్ నీటిమట్టం...
### ఖరీఫ్ సాగుకు జీవం...

**ప్రజాపక్షం/హాలియా:** ఎగువన శ్రీశైలానికి ప్రవాహం పెరగడంతో శ్రీశైలం జలాశయం నుంచి నాగార్జునసాగర్ కు నీటి విడుదల ప్రారంభం కావడంతో ఆయకట్టు రైతుల్లో సాగుపై ఆశలు చిగురించాయి. మంగళవారం మధ్యాహ్నం శ్రీశైలం జలాశయం నుండి రెండు గేట్ల ద్వారా నీటిని దిగువన ఉన్న నాగార్జునసాగర్ కు విడుదల చేయడం ఖరీఫ్ సాగుకు జీవం పోసినట్లయింది. ప్రస్తుతం వర్షాలు ముఖం చాటేసినా ఎగువన భారీ వర్షాలకు వస్తున్న వరదతో జలాశయాలు నిండుకుండలా మారాయి. ఈ కారణంగా ఎగువన వస్తున్న ప్రతి నీటి బొట్టు దిగువ ఉన్న ప్రాజెక్టుల్లోకి విడుదల చేస్తున్నారు. దీంతో నాగార్జునసాగర్ డ్యాం కూడా ఈ నెలాఖరు వరకు నిండే అవకాశాలు కనిపిస్తున్నాయి. భారీ ఎత్తున వర్షాలు లేనప్పటికీ నాగార్జునసాగర్ ఆయకట్టు పరిధిలో ఖరీఫ్ సాగుకు సాగునీటి డోకా ఉండదేమో. సాగర్ ఆయకట్టు పరిధిలో సుమారు 11 లక్షల ఎకరాల్లో వరి సాగుకు రైతులు సిద్ధమవుతున్నారు. ఈ క్రమంలో గత 20 రోజులుగా వరి నారుమడులను సిద్ధం చేసే పనులు రైతులు కసరత్తు చేస్తున్నారు. ప్రస్తుతం సాగర్ జలాశయంలో మంగళవారం రాత్రి వరకు 532 అడుగులకు నీటిమట్టం చేరే అవకాశం ఉంది. 550 అడుగుల వరకు నీటిమట్టం చేరినట్లయితే ఒక పంటకు సాగు నీటి విడుదల తప్పకుండా వచ్చే అవకాశం ఉంది. ప్రస్తుతం శ్రీశైలం జలాశయానికి సుమారు రెండు లక్షల క్యూసెక్కుల వరద నీరు వస్తుండడంతో ఆ వచ్చే నీరు మొత్తం దిగువనం ఉన్న సాగర్ జలాశయానికి విడుదల చేస్తున్నారు. ఈ వరద మరింత పెరిగితే నాగార్జునసాగర్ డ్యాం కూడా మరో 15 రోజుల్లో నిండుకుండలా నీటితో కళకళలాడే అవకాశం ఉండడంతో ఆయకట్టు రైతులను ఆశల పల్లకిలో ఉంచింది.



## అండర్ గ్రౌండ్ డ్రైనేజీని నిర్మించాలి



**ప్రజాపక్షం/చిట్యాల:** నల్లగొండ జిల్లా చిట్యాల మున్సిపాలిటిలోని భాగ్యనగర్ కాలనీలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీని నిర్మించాలని కోరుతూ కాలనీ వాసులు మంగళవారం స్థానిక మున్సిపల్ కమీషనర్‌కు వినతి పత్రాన్ని అందజేశారు. మురికి కాలువాలు లేకపోవడంతో కాలనీలో మురుగు నీటి నిల్వ పెరిగిపోతుందని, దాని కారణంగా దోమలు, క్రిమికీటకాల బెడదతో కాలనీ వాసులం అనారోగ్యానికి గురవుతున్నామని వారు తెలిపారు. అనంతరం కాలనీకి ఆనుకుని ఉన్న మద్యం దుకాణం కారణంగా మద్యం త్రాగేవారు ఖాళీ స్థలాలలో మద్యం సేవిస్తూ ఇబ్బందులకు గురిచేస్తున్నారని స్థానిక ఎస్ఐ రవికుమార్‌కు వినతి పత్రాన్ని సమర్పించారు. దాని నివారణ కోసం పోలీస్ పెట్రోలింగ్ చేయాలని వారు కోరారు. వినతి పత్రాన్ని సమర్పించిన వారిలో కాలని సంక్షేమ సంఘం అధ్యక్షులు కొంతం యాదగిరి రెడ్డి, ప్రధాన కార్యదర్శి గుత్తా సతీష్‌రెడ్డి, సభ్యులు గంజి యాదగిరి, గంజి శ్రీనివాస్, కుకుడాల గోవర్ధన్, బొల్లోజు సాంబమూర్తి తదితరులున్నారు.

## టూరిజం శాఖకు వన్నె తెచ్చిన పటేల్ రమేష్‌రెడ్డి



**ప్రజాపక్షం/సూర్యాపేటటౌన్:** తెలంగాణ టూరిజ డెవలప్‌మెంట్ కార్పోరేషన్ చైర్మన్ పటేల్ రమేష్‌రెడ్డి సంవత్సర కాలంలో ఎంతో అభివృద్ధి చేశారని సూర్యాపేట వ్యవసాయ మార్కెట్ వైస్ చైర్మన్, ఆర్యవైశ్య మహాసభ ఉపాధ్యక్షులు గట్టు శ్రీనివాస్ గుప్తా అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని కృష్ణా కాలనిలో గల పటేల్ రమేష్‌రెడ్డి నివాసంలో టూరిజం చైర్మన్‌గా సంవత్సర కాలం పూర్తి చేసుకున్న సందర్భంగా కేక్ కట్‌చేసి రమేష్‌రెడ్డికి తినిపించి సంబురాలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రేవంత్‌రెడ్డి అశీస్సులతో పటేల్ రమేష్‌రెడ్డి పదవి చేపట్టి తెలంగాణను టూరిజం హబ్‌గా మారుస్తున్నారని కొనియాడారు. పురాతనమైన ఉండ్రుగొండ లక్ష్మి నర్సింహ స్వామి దేవాలయం అభివృద్ధితో పాటు సద్దల చెర్వు, మిని ట్యాంక్ బండ్‌కు కోట్ల రూపాయల నిధులు విడుదల చేయించి అభివృద్ధి చేస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు డాక్టర్ ఊర రామ్మూర్తి యాదవ్, ముదిరెడ్డి రమణారెడ్డి, ధారావత్ వెంకన్న, వెలుగు వెంకన్న, నిమ్మల వెంకన్న, తండు శ్రీనివాస్‌గౌడ్, వల్దాస్ దేవేందర్, యాట ఉపేందర్, పిల్లల రమేష్‌నాయుడు, కుంచం అంజయ్య పాల్గొన్నారు.

## పేదల సాగుభూములపై హక్కులు
### దేవరకొండ ఎమ్మెల్యే బాలునాయక్

**ప్రజాపక్షం/దేవరకొండ :** దేవరకొండ పట్టణంలో ఎంఎల్‌ఏ కార్యాలయంలో మంగళవారం చందంపేట మండలంలో ఉన్న భూ సమస్యల పరిష్కారానికై జిల్లా అదనపు కలెక్టర్, ఆర్డీవో, ఫారెస్ట్, రెవెన్యూ అధికారులతో కలిసి సమీక్ష సమావేశం నిర్వహించారు. దేవరకొండ ఎంఎల్‌ఏ బాలునాయక్ ఈసందర్భంగా మాట్లాడుతూ పేదల దశాబ్దాల కాలంగా సాగు చేసుకుంటున్న భూములపై వారికి హక్కులు కల్పించే విషయంలో మానవీయ కోణంలో ఆలోచన చేయాలని ఎంఎల్‌ఏ బాలునాయక్ అధికారులకు సూచించారు. చిన్నచిన్న సమస్యలను సాకుగా చూపించి సమస్యను జఠిలం చేయవద్దని అటవిశాఖ అధికారులకు సూచించారు. నియోజకవర్గంలో గత కొన్ని సంవత్సరాల నుండి పొగిళ్ళ, కంబాలపల్లి గ్రామ రైతులు సాగు చేసుకుంటున్న భూములపై గిరిజనులకు హక్కులు కల్పించడానికి తమ ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉందన్నారు. వివిధ నిబంధనలు చూపుతూ ఆ భూములు అటవిశాఖకు చెందినవని అటవి అధికారులు కొర్రీలు పెడుతున్నారని పేర్కొన్నారు. ఈ అంశంపై రెవెన్యూ, ఫారెస్ట్ విభాగాలు సమన్వయంతో పనిచేసి వీలైనంత త్వరగా పరిష్కారం చూపేలా చర్యలు తీసుకోవాలని ఆదేవించారు. అనంతరం తహశీల్దార్ కార్యాలయంలో కానీ ఎంపిడివో కార్యాలయంలో గానీ ఇందిరమ్మ ఇండ్లపైన, కళ్యాణలక్ష్మి లో దోపిడికి పాల్పడితే సొంత పార్టీ వారైన ఉపేక్షించోద్దని అధికారులను సూచించారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ శ్రీనివాస్, ఆర్డివో రమణారెడ్డి, ఫారెస్ట్, రెవెన్యూ అధికారులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.






## నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలి
### ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శి ఎండి.ఇమ్రాన్

**ప్రజాపక్షం/ రామన్నపేట:** కార్మికుల హక్కులను హరించే విధంగా కేంద్రం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను వెంటనే రద్దు చేయాలని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి ఎండి.ఇమ్రాన్ కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం మండల ఏంద్రంలో ఏఐటీయూసీ ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ కేంద్రం 8గంటల పనిదినాన్ని 10గంటలకు మారుస్తూ జీవో నెం.282ను తీసుకొచ్చి కార్మికులను బానిసలుగా మార్చే ప్రయత్నం చేస్తుందన్నారు. కార్మిక చట్టాలను యదావిధిగా కొనసాగించాలని, కనీస వేతనం రూ.26వేలు, పెన్షన్ రూ.5వేలు, ప్రభుత్వ రంగ సంస్థలను పరిరక్షించాలని, ప్రభుత్వరంగ సంస్థల్లో వంద శాతం విదేశి ప్రత్యక్ష పెట్టుబడులు ఉపసంహరించుకోవాలన్నారు. ఈనెల 9న జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి ఉట్కూరి నరసింహా, ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు గొరిగే నరసింహా, మండల అధ్యక్షుడు బత్తుల సత్యం, ప్రధా కార్యదర్శి శివరాత్రి సమ్మయ్య, భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి దుర్యోధన్, నాయకులు పర్వా సుదర్శన్, ఉట్కూరి కృష్ణ, మల్లయ్య, తోటకూరి అంజయ్య, బండ స్వామి, గొరిగె రవి, మోటె నగేష్, పల్లె ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

## ఆగస్టు 15లోపు ఆన్‌లైన్ దరఖాస్తు

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** గతంలో ఇందిరమ్మ ఇండ్ల కోసం దరఖాస్తు చేసుకోని వికలాంగులు, వితంతువులు ఆగస్టు 15లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. మంగళవారం స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆయా మండలాల ఎంపీడీవీలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇండ్లు లేని వితంతువులు, వికలాంగులు ఆగస్టు 15లోపు దరఖాస్తు చేసుకోవాలని సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించినందున ఆయా మండలాల్లో ప్రజలందరికి అవగాహన కలిగేలా మండల అధికారులు విస్తృత ప్రచారం చేయాలని, ఆన్‌లైన్‌లో వచ్చిన దరఖాస్తులను పరిశీలించి అర్హులను గుర్తించాలని, అవకతవకలకు పాల్పడితే చర్యలు తప్పవన్నారు.




## పరిశుభ్రతతోనే ఆరోగ్య భద్రత

**ప్రజాపక్షం/సూర్యాపేటటౌన్:** ఇంటి పరిసరాల పరిశుభ్రతతోనే ప్రజల ఆరోగ్య భద్రత దాగివుందని మున్సిపల్ డిఈ సత్యారావు, సానిటరీ ఇన్స్‌పెక్టర్ సారగండ్ల శ్రీనివాస్ లు అన్నారు. మంగళవారం 33వ వార్డులో 100 రోజుల ప్రణాళికలో బాగంగా పరిసరాల పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇళ్లలోని చెత్తను తడి చెత్త, పోడి చెత్తగా వేరు చేసి మీ ఇళ్ల ముందుకు వచ్చే మున్సిపల్ వాహనాలకు అందించాలన్నారు. డ్రైనేజీలో నీరు నిల్వ ఉండకూడా చూడాలని, రానున్న వర్షకాలన్ని దృష్టిలో పెట్టుకుని తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది, వార్డు సభ్యులు, ప్రజలు పాల్గొన్నారు.

## గంజాయి తాగినా, విక్రయించిన కఠిన చర్యలు

**ప్రజాపక్షం/మునగాల:** యువత గంజాయి తాగిన, విక్రయించినా వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని మునగాల ఎస్ఐ ప్రవీణ్‌కుమార్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. గంజాయిని తాగి వారి భవిష్యతను నాశనం చేసుకోవద్దని, గంజాయి వంటి మాదకద్రవ్యాల బారిన పడితే నేరాలు ఎక్కువగా చేస్తారని వాటి నియంత్రణకు పోలీసులకు ప్రజలు సహకరించాలన్నారు. గంజాయి మత్తులో పడి జీవితాలను నాశనం చేసుకోవద్దన్నారు. మంచిని తీసుకుని చెడును వదిలేయాలని, యువత చదువు, క్రీడలు తప్పా ఇంకో ఆలోచన దరికి చేరనీయవద్దని అన్నారు. యువత గంజాయి మత్తులో పడి జీవితాలను నాశనం చేసుకోని కుటుంబాలకు శ్లోకం మిగల్చవద్దని సూచించారు.

## నేడు అభివృద్ధి పనులకు శంకుస్థాపన

**ప్రజాపక్షం/భూదాన్ పోచంపల్లి:** మండల వ్యాప్తంగా పలు గ్రామాలలో వివిధ అభివృద్ధి పనులకు భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి నేడు శంకుస్థాపన చేయనున్నారు. ఈ పర్యటనలో హెచ్‌ఎండిఏ, ఎస్సీ సబ్ ప్లాన్ ద్వారా మంజూరైన విధులతో దేశ్‌ముఖి, పిలాయిపల్లి జగత్పల్లి, పెద్దగూడెం, పోచంపల్లి పట్టణం 5వ వార్డులో పార్కు నిర్మాణానికి శంకుస్థాపన చేస్తారు. అనంతరం వనమహోత్సవ కార్యక్రమంలో పాల్గోని మొక్కలు నాటుతారు.

## యాదయ్య యాదవ్ విగ్రహావిష్కరణ

**ప్రజాపక్షం/భువనగిరిరూరల్ :** భువనగిరి మండలం గ్రామానికి చెందిన బిఆర్ఎస్ సీనియర్ నాయకులు మాజీ ఉప సర్పంచ్ స్వర్గీయ రాసాల యాదయ్య యాదవ్ ఇటీవల మృతి చెందాడు. ఈ మేరకు కుటుంబ సభ్యుల సమక్షంలో విగ్రహావిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు జనగాం పాండు, మాజీ ఎంపిటిసి రాసాల మల్లేశం, పుట్ట వీరేష్, రాసాల శేఖర్ యాదవ్, రాసాల సందీప్, రాసాల అజ్జి యాదవ్, రాసాల శరత్ యాదవ్ పాల్గొన్నారు.



# మాజీ ఎమ్మెల్యే మల్లయ్య వ్యాఖ్యలకు ఖండన

**ప్రజాపక్షం/కోదాడ:** బిఆర్ఎస్ కోదాడ నియోజకవర్గ ఇన్‌ఛార్జిగా త్వరలోనే మల్లయ్య యాదవ్‌ను పీకేస్తారన్న ఆలోచనతో పిచ్చి పిచ్చిగా మాట్లాడుతున్నాడని కాంగ్రెస్ నాయకులు విమర్శించారు. మంగళవారం కోదాడ పట్టణంలోని కాంగ్రెస్ కార్యాలయంలో ఏర్పాటు చేసినవిలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. అభివృద్దే ద్యేయంగా ముందుకు సాగుతున్న మంత్రి ఉత్తమ్, ఎమ్మెల్యే పద్మావతిరెడ్డి పట్ల మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్ చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. కేవలం సానుభూతితో 600 ఓట్లతో ఎమ్మెల్యేగా గెలిచి గత ఎన్నికల్లో ప్రజలు 60వేల ఓట్లతో ఓడించిన ఇంకా సిగ్గు రాలేదని తమ నాయకుల పట్ల అసత్య ఆరోపణలు చేస్తే చూస్తు ఊరుకోవమని అన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎవరి సత్తా ఎమీటో ప్రజలే నిర్ణయిస్తారని ఇకనైనా పిచ్చి మాటలు మానుకోవాలన్నారు. గంజాయి మాఫీయా వాళ్లతో చేతులు కలిసి కోదాడ నియోజకవర్గాన్ని భ్రష్టు పట్టించింది నిజం కాదా అన్నారు. మట్టి కాంట్రాక్టర్లు మాట్లాడుతూ గత



ప్రభుత్వ హాయంలో తాము పూర్తిగా విసిగిపోయామని మా వద్ద ఎంపిపి, ఎమ్మెల్యే డబ్బులు వసూలు చేసి కూడా మట్టి తోలకాలు తోలనివ్వలేదని ప్రస్తుత ప్రభుత్వంలో ఎవరికి ఎక్కడ ఒక్క రూపాయి ఇవ్వకుండా ప్రజలకు తక్కువ ధరకు మట్టిని అందిస్తున్నామని అన్నారు. ఈ సమావేశంలో పిసిసి డెలిగెట్ చింతకుంట్ల లక్ష్మి నారాయణరెడ్డి, జిల్లా గ్రంధాలయ చైర్మన్ వంగవీటి రామారావు, ముత్తవరపు పాండు రంగారావు, పార సీతయ్య, కందుల కోటేశ్వరరావు, సిహెచ్ శ్రీనివాసరావు, కాంపాటి శ్రీను, శ్రీనివాస రెడ్డి, పాలూరి సత్యనారాయణ, సూర్యనారాయణ యాదవ్, శ్రీను, డేగ శ్రీధర్ పాల్గొన్నారు.

# డివిటిపిఎస్ సంస్మరణ సభ విజయవంతం చేయాలి



**ప్రజాపక్షం/చివ్వెంల:** భారత విప్లవోద్యమా రథసారధులు కామ్రేడ్ దేవులపల్లి వెంకటేశ్వరరావు, కామ్రేడ్ తరిమెల నాగిరెడ్డి సంస్మరణ సభ ఈనెల 12న చివ్వెలం మండల పరిధిలోని అక్కలదేవిగూడెంలోని దేవులపల్లి వెంకటేశ్వరరావు స్మారక సమాది వద్ద నిర్వహిస్తున్నట్లు యుసిసిఆర్ ఎంఎల్ నాయకులు భాషిపంగు సునీల్, నల్లగొండ వెంకన్న లు తెలిపారు. మంగళవారం సంస్మరణ సభ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ దేవులపల్లి, నాగిరెడ్డిలు ఇద్దరు జూలై నెలలో అమరులయ్యారని, ఈ ఇద్దరి నాయకులు తమ రాజకీయ జీవితాన్ని విద్యార్థి దశ నుండే ప్రారంభించి నాలుగు దశాబ్దాలకు పైగా అనేక పోరాటాలను, నిర్బంధాలను ఎదుర్కొంటూ తమ జీవితం చిట్ట చివరి వరకు విప్లవకారులుగా కొనసాగి రహాస్య జీవితంలోనే అమరులయ్యారని అన్నారు. ఈ కార్యక్రమంలో కోడి బండ్లయ్య, ఉప్పల మల్లయ్య, నల్లగొండ లింగయ్య, గోగుల వెంకన్న, బచ్చలకూర రాణి, వెంకటేష్, మధుసూదన్, సుమన్ పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇండ్ల పథకంలో స్కామ్ నిరూపిస్తే రాజకీయ సన్యాసం తీసుకుంటా

**ప్రజాపక్షం/ రామన్నపేట:** మండలంలో లబ్ధిదారులకు మంజూరైన ఇందిరమ్మ ఇండ్ల పథకంలో కాంగ్రెస్ నాయకులు చేతివాటం ప్రదర్శించారని నిరూపిస్తే రాజకీయ సన్యాసం తీసుకుంటానని కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు గంగుల వెంకటరాజిరెడ్డి సవాల్ విసిరారు. మంగళవారం స్థానిక రహదారి బంగ్లాలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో ఎమ్మెల్యే వేముల వీరేశం చేస్తున్న అభివృద్ధిని చూసి ఓర్వలేకనే నాయకులు విమర్శలు చేస్తున్నారని ఆరోపించారు. బీఆర్ఎస్ నాయకులు నియోజకవర్గంలో, మండలంలో ఎలాంటి అభివృద్ధి జరగడం లేదని మతిభ్రమించి ఆరోపణలు చేస్తున్నారని, వారు వస్తే 18 నెలల నుంచి జరిగిన అభివృద్ధి కార్యక్రమాలు కళ్లకు కట్టినట్లు చూపిస్తామని అన్నారు. మండలంలో 684 ఇండ్లు మంజూరు అయ్యాయని, ఉత్తటూరు గ్రామంలో ఇందిరమ్మ ఇండ్లు స్లాబ్ దశలో ఉన్నాయని, రామన్నపేటలో 8 ఇండ్లు నిర్మాణంలో తుదిదశలో ఉన్నాయన్నారు. జిల్లా కలెక్టర్ హనుమంతరావు, ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యే వేముల వీరేశం కలిసి రామన్నపేటలో నిరుపేద ఇండ్లలో సన్నబియ్యంతో అన్నం తిని వారికి ఇల్లు మంజూరు చేశారని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు ఎండి.జమీరొద్దిన్, నాయకులు జినుకుల ప్రభాకర్, బత్తుల కృష్ణ, గురజాల అంజిరెడ్డి, గోదాసు పృద్వీరాజ్, వనం చంద్రశేఖర్, జెల్లా వెంకటేష్, బొడ్డుపల్లి లింగయ్య, కోట సుధాకర్, కూనూరు కృష్ణ, ఎర్ర శేఖర్‌గౌడ్, సాల్వేరు లింగం, గొలుసుల ప్రసాద్, కొమ్ము శేఖర్, మేడి శంకర్, గురుకు శివ, రవీందర్ పాల్గొన్నారు.

# ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు నేరుగా ఇంజనీరింగ్ సీట్లు




**ప్రజాపక్షం/భువనగిరి :** ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చదివి ఉత్తీర్ణత అయిన వారికి రాబోయే విద్యా సంవత్సరంలో నేరుగా ఇంజనీరింగ్ కళాశాలలో ప్రవేశం కల్పిస్తానని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించడం అభినందనీయమని ఇంటర్ బోర్డు జాయింట్ సెక్రటరీ, నల్గొండ జిల్లా పరిశీలకులు భీమ్ సింగ్ తెలిపారు. మంగళవారం భువనగిరి జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం జూనియర్ కళాశాలలో మౌలిక సదుపాయాల కోసం రూ.56 కోట్లు నిధులు మంజూరు చేసిందన్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఉచిత విద్యతో పాటు, ఉచితముగా పుస్తకాలు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వ కళాశాలలను విద్యార్థులు ఉపయోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ పాపిరెడ్డి తోపాటు అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.



## గురుపౌర్ణమికి ఏర్పాట్లు పూర్తి

**ప్రజాపక్షం/హుజూర్‌నగర్:** ఈనెల 10న గురుపౌర్ణమిని పురస్కరించుకొని హుజూర్‌నగర్ పట్టణంలోని శ్రీ శిరిడి సాయిబాబా ఆలయంలో ఏర్పాట్లు పూర్తి చేసినట్లు శ్రీశిరిడి సాయి సమాజం సెక్రట్రీ ఓరుగంటి నాగేశ్వరరావు తెలిపారు. మంగళవారం సాయిబాబా కళ్యాణ మండపంలో విలేకర్ల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉదయం ఐదు గంటలకు వచ్చే భక్తులచే సాయిబాబాకు పంచామృతములచే అభిషేకములు,విశేష పూజా కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు తెలిపారు. శ్రీ అన్నమయ్య భజన మండలి వారిచే భజన గురు సత్కార కార్యక్రమం, సాయంత్రం ఐదు గంటలకు మహిళా భక్త బృందం వారితో చామంతి,గులాభీ,మల్లెపూలచే సాయిబాబాకు అర్చన వంటి మహోత్తరమైన కార్యక్రమాలను నిర్వహించడం జరుగుతుందన్నారు. భక్తులు సకాలంలో ఆలయానికి చేరుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జాయింట్ సెక్రట్రీ ఆకుల రాము,ప్రధాన పూజారి జానకి రామ శర్మ తదితరులు పాల్గొన్నారు.

## 14న పెన్షన్ల మహాసభ



**ప్రజాపక్షం/హుజూర్‌నగర్:** ఈనెల 14న సూర్యాపేట జిల్లా కేంద్రంలో నిర్వహించనున్న ఆసరా చేయూత పెన్షన్ల మహాసభను విజయవంతం చేయాలని పలువురు దివ్యాంగుల సంఘం నాయకులు పిలుపునిచ్చారు. మంగళవారం హుజూర్‌నగర్‌లో పట్టణ వికలాంగుల హక్కుల పోరాట సమితి సంఘం సభ్యుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పద్మశ్రీ అవార్డు గ్రహీత మంద కృష్ణ మాదిన ఆదేశానుసారంగా వృద్దులు,వికలాంగులు,వితంతువులు,ఒంటరి మహిళలు,చేయూత,ఆసరా పెన్షన్లను తీసుకుంటున్నావారితో సూర్యాపేటలో మహాసభను ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలలో భాగంగా పెన్షన్లను పెంచాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పొనుగుపాటి లక్ష్మణ్‌రావు,కాలం శ్రీనివాస్,ఇందిరాల పిచ్చయ్య,రూపారాణి,తారాభి,బ్రహ్మం,నాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ బడిలో నాణ్యమైన విద్య

**ప్రజాపక్షం/కోదాడ:** ప్రైవేట్ పాఠశాలలు, కార్పోరేట్‌కు ధీటుగా ప్రభుత్వ బడిలో నాణ్యమైన విద్యను అందిస్తున్నామని, పాఠశాలలో మెరుగైన వసతుల సౌకర్యాలను కల్పిస్తున్నామని కోదాడ మండల విద్యాధికారి సలీంషరిఫ్ అన్నారు. మంగళవారం విద్యార్థుల తల్లి దండ్రుల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. పదవ తరగతి విద్యార్థుల కోసం ప్రత్యేకంగా పాఠశాల ప్రారంభం నుండి విద్యా కార్యచరణ ప్రణాళికను అమలు చేస్తున్నామని, ప్రతి విద్యార్థిని నాణ్యమైన విద్య అందేటట్లు ఉపాధ్యాయులు సమష్టిగా కృషి చేస్తున్నారని తెలిపారు. పాఠశాల విద్యాభివృద్దిలో విద్యార్థుల పురోగతికి తల్లిదండ్రులు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఇన్‌ఛార్జి ప్రధానోపాధ్యాయులు డి.మార్కేండేయ, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.





## అర్ధరాత్రి నడిరోడ్డుపై యువకుల హల్‌చల్

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** మిర్యాలగూడ మండలం గూడూరులో అర్ధరాత్రి యువకులు నడిరోడ్డుపై హల్‌చల్ సృష్టించారు. అద్దంకి నార్కట్‌పల్లి రహదారిపై వచ్చే వాహనాలను సైతం ఆపి ప్రయాణీకులను భయ భ్రాంతులకు గురి చేశారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం మద్యం, గంజాయి మత్తులో ఉన్న కొంత మంది యువకులు నడిరోడ్డుపై హల్‌చల్ చేసినట్లు తెలిపారు. రోడ్డుపై హల్‌చల్ చేస్తున్న విషయాన్ని కొంత మంది వీడియో తీసి సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. యువకుల హల్‌చల్ చేస్తున్న వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఇదిలా ఉండగా ఇద్దరు యువకులను మిర్యాలగూడ రూరల్ పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం.

## మెనూ ప్రకారం భోజనం



**ప్రజాపక్షం/ మాడ్గులపల్లి:** ప్రభుత్వం ప్రకటించిన విధంగా ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని మండల ప్రత్యేకాధికారి వెంకటేశ్వర్లు అన్నారు. మంగళవారం మిర్యాలగూడలో నిర్వహిస్తున్న మాడ్గులపల్లి కేజీబీవీ విద్యాలయాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేసి పాఠశాల ఆవరణను, వంట గదిని పరిశీలించి మాట్లాడారు. ప్రస్తుత వర్షాకాలంలో వంటగదిని, పాఠశాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం విద్యార్థినిలకు సబ్జెక్టుల్లో పలు ప్రశ్నలు వేసి సమాధానాలు రాబట్టారు. కార్యక్రమంలో ఎంఈవో వెంకటమ్మ, జూనియర్ అసిస్టెంట్ శ్రీకాంత్ పాల్గొన్నారు.

## ప్రైవేట్ పాఠశాలలపై చర్యలు

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** ప్రభుత్వ నిబంధనలు పాటించని పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని బీసీ యువజన సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ తిరుమలగిరి అశోక్ అన్నారు. మంగళవారం స్థానికంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మిర్యాలగూడలో ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి పెద్ద మొత్తంలో పుస్తకాలు, ఫీజులు, యూనిఫాం, డైరీల పేరిట పెద్ద మొత్తంలో డబ్బులు వసూలు చేస్తున్నా విద్యాశాఖ అధికారులు పట్టించుకోకపోవడంతో తల్లిదండ్రులు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. కార్యక్రమంలో రమేష్, శేఖర్, సతీష్, అజయ్, రవి, వెంకట్, మహేందర్ తదితరులు ఉన్నారు.



# నల్లగొండలో హాట్ కేకుల్లా అమ్ముడైన హౌసింగ్ బోర్డు ప్లాట్లు



**ప్రజాపక్షం/ నల్లగొండ టౌన్:** నల్లగొండ దేవరకొండ రోడ్ హౌసింగ్ బోర్డు కాలనీలోని హెచ్ ఐజి, ఎంఐజి ప్లాట్లు మంచి ధరతో హ్యాట్ కేకుల్లా అమ్ముడయ్యాయి. మంగళవారం నిర్వహించిన వేలంలో 21 ప్లాట్లు అమ్ముడయ్యాయి. ఈ విక్రయాల ద్వారా హౌసింగ్ బోర్డుకు సుమారు సుమారు 9 కోట్లు మేర ఆదాయం వచ్చింది. వీటిలో పలు ప్లాట్లను నిర్ణయించిన ఆఫ్ సెట్ ధర కంటే దాదాపు రెట్టింపు ధరతో వేలం పాటలో కొనుగోలు చేశారు.హెచ్ఐ జీ,ఎంఐజికి చెందిన 27 ప్లాట్ల విక్రయానికి హౌజింగ్ బోర్డు నోటిఫికేషన్ ఇచ్చింది. ఇందులో భాగంగా నిర్వహించిన వేలం పాటలో అధిక సంఖ్యలో కొనుగోలుదారులు పాల్గొన్నారు.చదరపు గజానికి హెచ్ఐజి ప్లాట్ కు రూ.15 వేలు, ఎంఐజి స్థలానికి రూ.13 వేలుగా ఆఫ్ సెట్ ధరగా నిర్ధారించగా హెచ్ఐజి ప్లాట్ ను గరిష్ఠంగా రూ.28,500 ధరకు కొనుగోలు చేశారు. మరో రెండు హెచ్ఐజి ప్లాట్ల ను కూడా నిర్దేశిత ఆఫ్ సెట్ ధర కంటే అధికంగా రూ. 25,500 కు, రూ. 24,000 లకు వేలం పాటలో కొనుగోలు చేశారు. ఎంఐజి ప్లాట్ల విషయంలో 220 చదరపు గజాల ప్లాట్ గరిష్ఠంగా 23,500 వరకు ధర పలికింది. అన్ని ప్లాట్లకు కూడా కనీస ధర కంటే అధికంగానే చెల్లించి కొనుగోలు చేయడం విశేషం. ఇలా మొత్తం మీద ఈ కాలనీలో 4660 చదరపు గజాల విస్తీర్ణంలోని వివిధ రకాల ప్లాట్లను విక్రయించగా, సగటున ఒక్కో చదరపు గజం స్థలానికి రూ.19,069 ధర పలికింది.

# ఎంఆర్‌పి ధరలకు మించి ఎరువులను అమ్మితే చర్యలు

**ప్రజాపక్షం/ నల్లగొండ టౌన్:** ప్రభుత్వం నిర్దేశించిన ఎంఆర్ పి ధరలకు మించి ఎరువులను అమ్మినా లేదా ఇతర ఎరువులతో లింకు పెట్టినా అలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి హెచ్చరించారు.జిల్లాలో యూరియాతో సహా అన్ని ఎరువులు సరిపోయినంతగా నిల్వలు ఉన్నాయని, అందువల్ల రైతులెవరు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఆమె స్పష్టం చేశారు.ఈ మేరకు జిల్లా కలెక్టర్ మంగళవారం ఒక ప్రకటన విడుదల చేస్తూ జిల్లాలోని అన్ని మండలాలలో తగినంతగా ఎరువుల నిలువలు ఉన్నాయని , ఈ నెలాఖరు వరకు ఎలాంటి ఎరువుల కొరతలేదని ,జిల్లాలోని అన్ని మండలాలలో ప్రతిరోజు 9000 మెట్రిక్ టన్నుల ఎరువులు అందుబాటులో ఉండేలా చూస్తున్నామని, ఈ నెలాఖరు వరకు ఎలాంటి కొరతలేదని స్పష్టం చేశారు. అంతేకాక జూలై 15 నుండే ఆగస్టు నెలకు అవసరమైన బఫర్ ఎరువులను సిద్ధంగా ఉంచేందుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ప్రైవేటు ఎరువుల డీలర్లు లేదా ఇతరులు ఎవరైనా ప్రభుత్వం నిర్దేశించిన ఎమ్మార్పీ ధరలకే ఎరువులను విక్రయించాలని, యూరియా ఇతర ఎరువులు అమ్మేందుకు ఇతర ఎరువులతో ఎట్టి పరిస్థితులలో లింకు పెట్టవద్దని, ఎవరైనా అలా చేసినట్లయితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఆయా మండలాలలో అందుబాటులో ఉన్న ఎరువుల వివరాల ను విడుదల చేశారు.

# జీతాల కోసం ఫీల్డ్ అసిస్టెంట్లు ఎదురుచూపులు

**ప్రజాపక్షం/వేములపల్లి:** మూడు నెలలుగా ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్లకు జీతాలు లేక పస్తులతో కుటుంబాలను వెల్లదీస్తున్నారని ఫీల్డ్ అసిస్టెంట్ల సంఘం (ఐఎన్ టియుసి) జిల్లా అధ్యక్షులు అంకెపాక జనార్ధన్ అన్నారు.మంగళవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ రాష్ట్రంలో ఉపాధి హామీ కూలీలతో పనులు చేయిస్తూ కేంద్రం నుంచి వీలైనంత ఎక్కువ నిధులు రాష్ట్రానికి రప్పించడంలో ప్రధాన పాత్ర పోషిస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్లకు వేతనాలు ఇవ్వకపోవడం దురదృష్టం అని అన్నారు.గత ప్రభుత్వం ఇచ్చేదని గత ఎన్నికల మేనిఫెస్టోలో ఫీల్డ్ అసిస్టెంట్లను రెగ్యులర్ చేసి 26వేల రూపాయలు కనీస వేతనంగా చేస్తామని హామీ ఇచ్చి నేటికి 18 నెలలు గడిచిపోయినప్పటికీ ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్ లకు సంబంధించి ఏ ఒక్క చిన్న సమస్య కూడా పరిష్కారం చేయకపోగా ఇచ్చే జీతాన్ని కూడా గత మూడు నెలలుగా నిరాకరించడం పై ఫీల్డ్ అసిస్టెంట్ కుటుంబాలు అనేక ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని అన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం తమను గుర్తించి ఇస్తానన్న జీతాన్ని ప్రతినెల చెల్లించాలని డిమాండ్ చేశారు.

# వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** సీజనల్ వ్యాదుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మున్సిపల్ కమిషనర్ జి.శ్రీనివాస్ సూచించారు. మున్సిపల్ కార్యాలయ సమావేశ మందిరంలో మంగళవారం ఆవార్డుల్లు, వార్డు ఆఫీసర్లకు జాతీయ కీటక జనిత వ్యాదుల నియంత్రణపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీజనల్ వ్యాదులైన మలేరియా, డెంగ్యూ, టైఫాయిడ్, విజృంభించే అవకాశాలు ఉన్నందున వ్యాదులు ప్రబలకుండా చూడాలన్నారు. ప్రజలు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, ముఖ్యంగా నీరు, వ్యర్థాలు నిల్వ ఉండకుండా చూసుకోవాలన్నారు. అన్ని శాఖల అధికారులు, పారిశుద్ధ్య సిబ్బంది సమన్వయంతో పనిచేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. దోమల నివారణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని ఆదేశించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాల్సిన బాధ్యత ప్రజలందరిపై ఉందన్నారు. పారిశుద్ధ్య సిబ్బంది మురుగు కాల్వలను శుభ్రపరిచి వ్యర్థాలను వెంటనే తొలగించాలన్నారు. వార్డు ఆఫీసర్లు ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ఎప్పటికప్పుడు ఉన్నత అధికారుల దృష్టికి తీసుకురావాలన్నారు. డీఎంహెచ్‌వో కేస రవి, మున్సిపల్ డీఈ వెంకన్న, ఆర్‌వో జ్ఞానేశ్వరి, ఈఈ శ్వేత, శానిటరి ఇన్స్‌పెక్టర్ వెంకటరమణ, వైద్యులు జానకిరామ్ ఉన్నారు.





## నూతన పాలసంఘం చైర్మన్‌కు సన్మానం

**ప్రజాపక్షం/భువనగిరిరూరల్ :** మండలంలోని అనాజిపురం నూతన పాలసంఘం చైర్మన్‌గా మర్రి సత్యనారాయణ ఎన్నికైన సందర్భంగా సిపిఎం పార్టీ అనాజిపురం గ్రామ శాఖ ఆధ్వర్యంలో వారిని సన్మానించడం జరిగింది. నూతనంగా ఎన్నికైన వారిని బార్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి మాజీ సర్పంచ్ బొల్లేపల్లి కుమార్ వారికి పూలమాలలు వేసి అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు ఎదునూరి మల్లేశం, గునుగుంట్ల శ్రీనివాస్, శాఖ కార్యదర్శి అబ్బుల్లాపురం వెంకటేశం, నాయకులు మహమ్మద్ జహంగీర్, ఎదునూరి వెంకటేశం, కదారి కృష్ణ, గంగసబోయిన బాలనర్సింహ, గంగసబోయిన పాండు, తోటకూరి మల్లేశం, భాను తదితరులు పాల్గొన్నారు.

## సోలిపురం కార్యదర్శికి షోకాజ్ మెమో జారీ



**ప్రజాపక్షం/మునుగోడు:** మండలంలోని సోలిపురం గ్రామాన్ని జిల్లా పంచాయతీ రాజ్ అధికారి వెంకయ్య మంగళవారం ఆకస్మికంగా తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ గ్రామంలో పారిశుద్ధ్యం పనులను పరిశీలించగా పారిశుధ్య పనులు సక్రమంగా లేవని సెగ్రిగేషన్ షెడ్డ డంపింగ్ యార్డ్ నిర్వహణ సరిగా లేదని పారిశుద్ధ కార్మికులు,ఆ గ్రామ కార్యదర్శి పై ఆగ్రహం వ్యక్తం చేసి పంచాయతీ కార్యదర్శికి షోకాజ్ మెమో జారీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో ప్రతి గ్రామంలో పారిశుధ్యం డంపింగ్ యార్డ్ పరిసరాల పరిశుభ్రత సక్రమంగా చూసుకోవాల్సిన బాధ్యత ప్రతి కార్యదర్శి పై ఉందని విధులలో అలసత్వం వహిస్తే కార్యదర్శులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఇంచార్జ్ ఎంపీడీవో భాస్కర్‌లు ఉన్నారు.

## 70వేల మెట్రిక్ టన్నుల యూరియా అవసరం



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** ఈ వానాకాలం సీజన్‌లో 70వేల మెట్రిక్ టన్నుల యూరియా అవసరం ఉండగా ఇప్పటివరకు 8వేల మెట్రిక్ టన్నుల యూరియాను రైతులు కొనుగోలు చేశారని జిల్లా వ్యవసాయాధికారి శ్రవణ్‌కుమార్ తెలిపారు. మంగళవారం స్థానికంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మంగళవారం నాటికి 22వేల మెట్రిక్ టన్నుల యూరియా సొసైటీలు, డీలర్ల, ఎన్‌డీసీఎంఎస్ వద్ద అందుబాటులో ఉందని, 10వేల మెట్రిక్ టన్నులు మార్క్‌ఫెడ్ గోదాంలో నిల్వ ఉందని, వెయ్యి టన్నుల యూరియా కంపెనీ వద్ద నిల్వ చేసుకున్నారన్నారు. ప్రతి రోజు మానిటరింగ్ చేస్తున్నామని జిల్లాలో ఎక్కడ యూరియా కొరత లేకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నామని చెప్పారు. ఆయన వెంట ఇన్‌ఛార్జి ఏడీఏ సైదానాయక్, ఫర్టిలైజర్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు జవహర్‌బాబు ఉన్నారు.

## లక్ష్మీదేవికాల్వ బస్సు పునరుద్ధరణ



**ప్రజాపక్షం/అడ్డగూడూరు :** మండలంలోని లక్ష్మీ దేవికాల్వ గ్రామానికి ఎమ్మెల్యే మందుల సామేలు కృషితో సూర్యాపేట డిపో బస్సు మంగళవారం పునరుద్ధరణ జరిగింది. లక్ష్మీ దేవికాల్వ, ధర్మారం, అడ్డగూడూరు మండలకేంద్ర ప్రజలు ఎమ్మెల్యే కు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.



## బొల్లం మల్లయ్యయాదవ్ వ్యాఖ్యలను ఖండిస్తున్నాం

**ప్రజాపక్షం/మునగాల:** బిఆర్ఎస్ నాయకులు, మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్ మంత్రి ఉత్తమ్‌కు మార్‌రెడ్డి, ఎమ్మెల్యే పద్మావతిరెడ్డి దంపతులపై అనుచిత వ్యాఖ్యలు చేస్తే ఊరుకునేది లేదని మునగాల మండల కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షులు కొప్పులజైపాల్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలో జరుగుతున్న ప్రజాపాలనను చూసి ఓర్వలేక బిఆర్ఎస్ నాయకులు జీర్ణించుకోలేకపోతున్నారని అన్నారు. ఉత్తమ్ దంపతుల మీద తప్పుడు వ్యాఖ్యలు చేస్తే సహించేదిలేదన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు కాసర్ల కోటేశ్వరరావు, కాలే సామ్యేలు, ఎస్‌కె పాషా, తక్కెళ్లపాటి సాయి, చిర్ర శ్రీనివాస్ పాల్గొన్నారు.

## టిబి వ్యాధిపై అవగాహన

**ప్రజాపక్షం/కొండమల్లేపల్లి;** మండల పరిధిలోని కొల్ ముంతల్‌పహాడ్ గ్రామ పంచాయతీ పరిధిలోని జేత్య తండా, బాపూజీనగర్‌లలో టిబి ముక్తు భారత్ 100 రోజులలో భాగంగా గ్రామ ప్రజలందరికి టిబి పది లక్షణాల గురించి కొండమల్లేపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది అవగాహన కల్పించారు. టిబి లక్షణాలు ఉన్న వారిని గుర్తించి ఎక్స్‌రే, తెమడ పరీక్షలకు ఏరియా ఆసుపత్రి దేవరకొండకు పంపించారు. ఈకార్యక్రమంలో సిహెచ్‌వో సుగుణాబాయి, ఎంఎల్‌హెచ్‌పి తేజస్వీని, సిస్టర్స్ సునిత, పద్మ, ఆశా వర్కర్లు యాదమ్మ, రేజి, శారద తదితరులు పాల్గొన్నారు.

## జిఒ నెం.282 రద్దు చేయాలి

**ప్రజాపక్షం/ మాడ్గులపల్లి:** కేంద్రం తీసుకొచ్చిన జీవో నెం.282ను వెంటనే రద్దు చేయాలని సీఐటీయూ జిల్లా నాయకుడు రొండి శ్రీనివాస్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో నిరసన వ్యక్తం చేసి ఆయన మాట్లాడారు. దేశ వ్యాప్తంగా బీజేపీ ప్రభుత్వం కార్మికులకు పనిగంటలు పెంచుతూ తీసుకొచ్చిన జీవో నెం.282ను వెంటనే రద్దు చేయాలన్నారు. కార్మికులు 8గంటల పనిదినాల కోసం అనేక పోరాటాలు చేస్తే కేంద్రం దాన్ని పదిగంటలకు మార్చేందుకు కుట్రలు చేస్తుందన్నారు. కనీస వేతన చట్టాన్ని అమలు చేయకుండా కార్మికుల నోట్లో మట్టి కొడ్తుందన్నారు. నేడు నిర్వహించే దేశ వ్యాప్త సమ్మెలో కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో యాదయ్య, రాజు, బాలయ్య, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

## దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె

**ప్రజాపక్షం/మునుగోడు:** కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక రైతు ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా నేడు జరిగే సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని సిపిఐ మండల కార్యదర్శి చాపల శ్రీను తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నో పోరాటాలు చేసి సాధించుకున్న కార్మిక చట్టాలను కాలరాయడానికి కేంద్ర ప్రభుత్వం ప్రయత్నం చేస్తూ 44 చట్టాలను నాలుగు కోడ్‌లుగా చేయాలని చూస్తుందన్నారు.అట్టి లేబర్ కోడ్‌లు అమలు అయితే కార్మికులకు ఎలాంటి హక్కులు లేకుండా పోతాయన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని జూలై 9 జరిగే దేశవ్యాపిత సమెల్లో కార్మికులు,కర్షకులు,రైతులు,రైతు కూలీలు అత్యధికంగా పాల్గొని దేశవ్యాప్తంగా జరిగే సమ్మెకు మద్దతు తెలుపుతూ ఈ సమ్మెను అన్ని వర్గాల ప్రయాణం జయప్రదం చేయాలని కోరారు.

## సమ్మెలో ఆర్‌టిసి కార్మికులు స్వచ్ఛందంగా పాల్గొనాలి



**ప్రజాపక్షం/ నల్లగొండ టౌన్:** దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలి టిజిఎస్ఆర్‌టిసి జెఏసి నల్లగొండ డిపో ఆధ్వర్యంలో మధ్యాహ్నం భోజన విరామ సమయంలో గేట్ మీటింగ్ నిర్వహించారు.ఈసమావేశంలో ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర నాయకులు కెవిఎస్ రెడ్డి మాట్లాడుతూ జాతీయ కార్మిక సంఘాల పిలుపులో భాగంగా ఈనెల9 న జరిగే దేశ వ్యాప్త సార్వత్రిక సమ్మెలో ఆర్‌టిసి కార్మికులందరు స్వచ్ఛందంగా పాల్గొనాలని పిలుపునిచ్చారు.కార్మిక వర్గం పోరాడి సాధించుకున్న 44 కార్మిక చట్టాలను 4 లేబర్ కోడ్ లుగా మార్చి పెట్టుబడి దారులకు, కార్పొరేట్ శక్తులకు, యాజమాన్యాలకు అనుకూలంగా మారుస్తూ మోడీ ప్రభుత్వం కార్మిక, ప్రజా వ్యతిరేఖ విధానాలకు పాల్పడుతుందని తెలిపారు. కార్యక్రమంలో ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు బాసాని వెంకటయ్య,రీజియన్ కార్యదర్శి ఎన్ఆర్‌సి రాజు ,టిఎంయూ నాయకులు టిజె రావు, ఎస్‌డబ్ల్యూఎఫ్ రాష్ట్ర కోశాధికారి కెవిఎస్ రెడ్డి, రీజియన్ అధ్యక్షులుకె నర్సింహా,గులాం రసూల్ ఎస్‌డబ్ల్యూయూ రీజియన్ కార్యదర్శి వై చంద్రయ్య, ఎ బిక్షం,వి సైదులు,జిపిరెడ్డి,జి రాజేష్,ఎం మల్లయ్య,పి నాగరాజు,ఏ హనుమంతు, శంకరయ్య, తదితరులు పాల్గొన్నారు.

## అర్జిజన్ కార్మికుల సమ్మెను జయప్రదం చేయాలి



**ప్రజాపక్షం/తుంగతుర్తి:** ఈనెల 14న నుంచి చేపట్టనున్న విద్యుత్ అర్జిజన్ కార్మికుల సమ్మెను జయప్రదం చేయాలని టివిఏసి జెఏసి జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ ముసిగుంపుల యాకయ్య, సబ్ డివిజన్ అధ్యక్షులు అండెం రమేష్‌గౌడ్ లు అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని విద్యుత్ సబ్ స్టేషన్‌లో సమ్మె గొడపత్రికను ఆవిష్కరించారు. ఒకే వ్యవస్థలో రెండు రూల్స్ రావడం తీసుకరావడం అన్యాయమని, స్టాండింగ్ ఆర్డర్స్‌ను రద్దు చేసి ఏపిఎస్ఈబి రూల్స్ వర్తింపజేయాలని ప్రభుత్వాన్ని కోరారు. కన్వర్షన్ అనేది ఉద్యోగ భద్రత, ఆత్మగౌరవానికి సంబంధించిన అత్యంత కీలకమైన డిమాండ్ అని, గత బిఆర్ఎస్ ప్రభుత్వం అర్టిజన్ అని ఓ ముద్దు పేరు పెట్టి కార్మికులను నట్టేట ముంచి పోయిందని, కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు అర్జిజన్ కార్మికులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరారు. యూనియన్‌తో సంబంధం లేకుండా సమ్మెలో పాల్గొని జయప్రదం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షులు నీలం సైదులు, కొమ్ము లింగమూర్తి, మల్లేష్, వెంకన్న, జి.వెంకన్న పాల్గొన్నారు.

## యువజన కాంగ్రెస్ మూల స్తంభం



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్** : కాంగ్రెస్ పార్టీలో ఎదగడానికి ప్రతి ఒక్కరికి యువజన కాంగ్రెస్ మూల స్తంభం లాంటిదని ఉమ్మడి నల్గొండ జిల్లా యువజన కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు, మాజీ జెడ్పిటిసి, నల్లగొండ పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గుమ్ముల మోహన్ రెడ్డి అన్నారు.మంగళవారం పట్టణంలోని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి క్యాంపు కార్యాలయంలో యువజన కాంగ్రెస్ నల్లగొండ నియోజకవర్గ అధ్యక్షుడు మామిడి కార్తీక్ ఆధ్వర్యంలో మొదటి విస్తృతస్థాయి సమావేశం జరిగింది.ఈ సమావేశంలో మోహన్ రెడ్డి పాల్గొని మాట్లాడుతూ యువజన కాంగ్రెస్‌లో కష్టపడి పని చేస్తే మంచి గుర్తింపు లభిస్తుందన్నారు. యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు మేకల ప్రమోద్ రెడ్డి మాట్లాడుతూ జిల్లాలో యువజన కాంగ్రెస్ ను మరింత బలోపేతం చేసేందుకు కార్యకర్తలంతా చిత్త శుద్ధితో పనిచేయాలని కోరారు. యువజన కాంగ్రెస్ కార్యకర్తలు ఏ కార్యక్రమం చేపట్టిన ఐవైసీ ద్వారా అప్లోడ్ చేయాలని సూచించారు.ఈ సమావేశంలో ఇంచార్జ్ పొన్నం తరుణ్ ,హరిప్రసాద్,శ్రీకాంత్,మామిడి కార్తీక్,షేక్ జాంగిర్ బాబా,గాలి నాగరాజు,కె.వి.ఆర్ సతీష్,పవన్, నాగరాజు,కొప్పు నవీన్ పాల్గొన్నారు.

## బెల్టుషాపుల నియంత్రణకు చర్యలు తీసుకోవాలి



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** అనధికార బెల్టుషాపులపై చర్యలు తీసుకోవాలని, మహిళలకు రక్షణ కల్పించాలని మంగళవారం ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి మాజీ కౌన్సిలర్ పందిరి అనిత కాలనీవాసులతో కలిసి వినతిపత్రం అందచేసి మాట్లాడారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కార్యక్రమంలో సీతారాంపురం 48వ వార్డులో అనధికార బెల్టుషాపులను నిర్వహించడం వల్ల మహిళలు, వృద్ధులు, విద్యార్థులు ఇబ్బందులకు గురవుతున్నారని అన్నారు. బెల్టుషాపులకు వచ్చే వారి వల్ల ప్రాణభయంతో కాలనీవాసులు ఉన్నారని, మద్యం మత్తులో ఉన్న వారు గృహాల మధ్య మూత్ర విసర్జన చేస్తూ, రోడ్లపై గుట్కా, పాన్‌లు నమిలి ఉమ్మివేస్తున్నారని అన్నారు. మహిళలపై అసభ్యకరంగా మాట్లాడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాత్రి 12, 1గంటల సమయంలో బెల్టుషాపులకు వస్తుండడంతో కాలనీవాసులకు అసౌకర్యంగా ఉందని వెంటనే అట్టి బెల్టుషాపును తొలగించి కాలనీవాసుల ఇబ్బందులను తొలగించాలన్నారు. కార్యక్రమంలో కాలనీవాసులు ఉన్నారు.



## సమ్మెను జయప్రదం చేయండి

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** రైతాంగ, ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ నేడు తలపెట్టిన దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి అన్నారు. సోమవారం ఆయన స్థానికంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ మూడోసారి అధికారంలోకి వచ్చిన మోడి ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలను అవలంభిస్తూ ప్రజలపై భారాలను మోపుతుందన్నారు. తెలంగాణాలో పది గంటల పని విధానాన్ని అమలు చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. ఈనెల 9న చేపట్టిన సార్వత్రిక సమ్మెలో కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో డబ్బికార్ మల్లేష్, వీరేపల్లి వెంకటేశ్వర్లు, రవినాయక్, బావండ్ల పాండు, తిరుపతి రామ్మూర్తి, సత్యనారాయణరావు, కోటిరెడ్డి, పిల్లుట్ల సైదులు, చౌగాని వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

## చట్టాలపై అవగాహన తప్పనిసరి



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** అవినీతి రహిత సమాజాన్ని స్థాపించడానికి ప్రతి ఒక్కరు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని సమాచార హక్కు చట్టం సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు చిలుముల కొండల్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దేవులపల్లి కార్తీకర్‌రాజు అన్నారు. నల్లగొండ జిల్లా మిర్యాలగూడ మండలం అవంతీపురంకు చెందిన కొట్టే అశోక్‌ను సమాచార హక్కు సాధన సమితి మండల అధ్యక్షునిగా నియమిస్తూ మంగళవారం నియామకపత్రాన్ని అందచేసిన అనంతరం మాట్లాడారు. సమాచార హక్కు చట్టం ద్వారా అధికారుల నుంచి ఎలాంటి సమాచారం అయినా పొందవచ్చున్నారు. ఇందుకోసం ఎలాంటి రుసుము చెల్లించాల్సిన అవసరం లేదన్నారు. చట్టాలపై అవగాహన కలిగి ఉన్నప్పుడే సమాజంలో జరుగుతున్న అవినీతి, అక్రమాలను అరికట్టవచ్చన్నారు. కార్యక్రమంలో శ్రీను, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

## కల్వకుర్తి లిఫ్ట్ మోటార్లు ఆన్ చేయడం బిఆర్ఎస్ విజయం

**ప్రజాపక్షం/డిండి;** కల్వకుర్తి లిఫ్ట్ ఇరిగేషన్ మోటార్లు మంగళవారం ఆన్ చేయడం బిఆర్ఎస్ పార్టీ విజయం అని దేవరకొండ బిఆర్ఎస్ నియోజకవర్గ నాయకులు వడ్త్య రమేష్‌నాయక్ అన్నారు. మంగళవారం రమేష్‌నాయక్ ఢిల్లీ నుండి చరవాణిలో ప్రజాపక్షం ప్రతినిధితో మాట్లాడుతూ ప్రభుత్వానికి రైతుల పట్ల చిత్తశుద్ధి లేదని, బిఆర్ఎస్ రైతుల అవసరాలకు అనుగుణంగా స్పందించి ప్రభుత్వంపై వత్తిడి తెస్తే తప్ప ప్రభుత్వానికి రైతాంగం పట్ల ఆలోచనలేదని ఆయన అన్నారు. బిఆర్ఎస్ ప్రశ్నిస్తే తప్ప ప్రభుత్వానికి రైతుల నీటి కష్టాలు గుర్తుకు రావడం లేదని ఆయన అన్నారు. రాజకీయ కక్షలు ఆపి పాలనపై, రైతాంగంపై ప్రభుత్వం దృష్టి సారించాలని, మాటల్లోనే ప్రజాపాలన తప్ప చేతల్లో లేదని అన్నారు. కల్వకుర్తి వలే కాళేశ్వరం మోటార్లు ఆన్ చేసి రిజర్వాయర్లు నింపి రైతులను ఆదుకోవాలని రమేష్‌నాయక్ అన్నారు.

## విద్యుత్ అంతరాయంపై ధర్నా

**ప్రజాపక్షం/డిండి;** డిండి పట్టణంలో గత కొన్ని రోజులుగా విద్యుత్ సమస్యతో సతమతమవుతున్న గ్రామస్థులు మంగళవారం హైదరాబాద్ శ్రీశైలం జాతీయ రహదారిపై రాజీవ్ గాంధీ చౌరస్తా వద్ద గ్రామ ప్రజలు యువకులు ధర్నా నిర్వహించారు. సమస్యను పరిష్కరించాలని లేదంటే పెద్ద ఎత్తున ఉద్యమం చేపడతామని వారు హెచ్చరించారు. వారం రోజుల్లో సమస్య పరిష్కరిస్తామని సంబంధిత అధికారులు తెలపడంతో వారం రోజుల్లో సమస్యను పరిష్కరించాలని లేదంటే ఆందోళన కొనసాగిస్తామని ఆందోళనకారులు హెచ్చరించారు. ట్రాఫిక్‌కు అంతరాయం కలిగి వాహనదారులు ఇబ్బందులు పడుతుండడంతో డిండి ఎస్ఐ రాజు ఆందోళనకారులను చెదరగొట్టి వాహనాలను క్లియర్ చేశారు.



## హామీలను నెరవేర్చాలి

**ప్రజాపక్షం/గుండాల;** భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కమిటి పిలుపు మేరకు మంగళవారం గుండాల మండల కేంద్రంలోని స్థానిక తహశీల్దార్ కార్యాలయం ముందు రైతుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ధర్నా నిర్వహించడం జరిగింది. ఈసందర్భంగా రైతు బీమా, రైతు భరోసా, కౌలు రైతులకు ఆర్థిక సాయం, కాంగ్రెస్ పార్టీ వరంగల్ డిక్లరేషన్‌లో ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరుతూ తహశీల్దార్ హరికృష్ణకు వినతి పత్రం అందజేశారు. ఈ ధర్నా కార్యక్రమంలో జిల్లా కోశాధికారి గుజ్జ సోమనర్సయ్య, జిల్లా కిసాన్ మోర్చా నాయకులు జక్కుల రామచంద్ర యాదవ్, మండల అధ్యక్షులు పింగళి విజయభాస్కర్ రెడ్డి పాల్గొన్నారు.

## నేడు సార్వత్రిక సమ్మె

**ప్రజాపక్షం/నార్కట్‌పల్లి:** ఈనెల 9న జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె గ్రామీణ బంద్‌ను జయప్రదం చేయాలని ప్రజాసంఘాల నాయకులు పిలుపునిచ్చారు. మంగళవారం స్థానికంగా ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో వారు మాట్లాడుతూ సమ్మెలో కార్మికులకు, వ్యవసాయ కూలీలకు, రైతులకు, కూలీలు , మేధావులు అందరూ పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు చింతపల్లి బయ్యన్న,వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు చెరుకు పెద్దులు, కెవిపియస్ జిల్లా కమిటి సభ్యుడు దండు రవి, ప్రజానాట్య మండలి మండల కార్యదర్శి ఆమనగంటి అయిలయ్య, బోల్లెదు సైదులు, ఆవాజ్ నాయకులు నన్నెసాబ్ తదితరులు పాల్గొన్నారు.

## నూతన పాల సెంటర్ చైర్మన్‌కు సన్మానం

**ప్రజాపక్షం/వలిగొండ :** వలిగొండ మండలం వెలువర్తి గ్రామ పాల సెంటర్ నూతన చైర్మన్‌గా బిఆర్ఎస్ అభ్యర్థి మల్లం కిష్టయ్య గౌడ్ ఇటీవల ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా మంగళవారం భువనగిరి మాజీ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్ రెడ్డి హైదరాబాదులోని ఆయన నివాసంలో నూతన చైర్మన్‌ని సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మండల బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు తుమ్మల వెంకట్ రెడ్డి, మండల ఎస్సీ సెల్ ఉపాధ్యక్షులు కూచిమల్ల నాగేష్, మండల సోషల్ మీడియా అధ్యక్షులు కూచిమల్ల సుధాకర్, గ్రామశాఖ అధ్యక్షులు కలుకూరి రాములు, మాజీ చైర్మన్లు బూడిద పాపయ్య, నానమాల ఉప్పలయ్య, చెవ్వ వెంకటేశం, గట్టు పాపయ్య, మందుల కృష్ణ పాల్గొన్నారు.



# తండాల్లో ఘనంగా సీత్లా పండుగ

**ప్రజాపక్షం/సూర్యాపేట:** తరతరాలుగా గిరిజనులు ప్రతి సంవత్సరం పెద్దపుషాల కార్తెలో మొదటి మంగళవారం నిర్వహించే సీత్లా పండుగ (దాటుడు) పండుగను జిల్లా వ్యాప్తంగా గిరిజనులు వారి సంప్రదాయాల ప్రకారం ఘనంగా నిర్వహించారు. ముందుగా తమ తండా శివారులో సమీపంలో బంజారుల ప్రకృతి దేవతలైన మేరామాయడి, తోళ్ల భవాని, మంత్రోల్, కంకాళియాడి, హీంగ్ళా, ధ్వాళాంగర్, సీత్లాయాడిలను ప్రతిష్టించారు. ఇంటి వద్ద పూజలు పూర్తి చేసుకున్న మహిళలు కన్నె పిల్లలు అమ్మవారులకు నైవేధ్యంగా సమర్పించేందుకు జొన్న గుగ్గులు, పప్పు ధాన్యాలతో తయారు చేసిన ఘుగ్రి( గుగ్గిళ్లు), లాప్సీ (పాయసం), ఏడు ఎండు మిర్చి, ఉల్లిగడ్డ, చింతపండు, రూపాయి బిల్లను కాకోటి ( చెక్కపాత్ర) నేటి తాంబుళంలో పెట్టి దానిపై పూళ్యాగణోతో కల్పి కన్నెలు పిల్లలు ఆ పళ్లెంను నెత్తిన



పెట్టుకుని సీగేర్‌పాణి (బావి నుండి సేకరించిన నిండుకుండ నీటి)తో సేవాలాల్ మహారాజ్, సీత్లా భవానిని కీర్తిస్తూ పాటలు పాడుతూ, డప్పు చప్పుళ్లతో యువతి, యువకులు నృత్యాలు చేస్తూ పూజ ప్రదేశానికి చేరుకుంటారు. ఈ కార్యక్రమంలో డిసిసి ప్రధాన కార్యదర్శి కృష్ణానాయక్, శంకర్‌నాయక్, సక్రునాయక్, జేతూనాయక్, గుగులోతు రాజునాయక్, వీరన్ననాయక్, లావుడ్య చంటిచౌహాన్, లవకుశనాయక్, జలందర్‌నాయక్ పాల్గొన్నారు.

## చిత్తశుద్ధితో పనిచేస్తాం



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ :** ఎలక్ట్రిసిటీ ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం చిత్తశుద్ధితో పనిచేస్తామని తెలంగాణ రాష్ట్ర ఎలక్ట్రిసిటీ ఎస్‌సి,ఎస్‌టి ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు కే జయపాల్, సిహెచ్ రాజు లు హామీ ఇచ్చారు. మంగళవారం పట్టణంలోని అంబేద్కర్ స్ఫూర్తి భవనంలో అసోసియేషన్ జిల్లా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా కే జయపాల్, వర్కింగ్ ప్రెసిడెంట్ గా వంగూరు యాదగిరి,ఉపాధ్యక్షులు గా ఒలికి ఎల్లయ్య, ప్రధాన కార్యదర్శిగా రాజు చిట్యాల, జాయింట్ సెక్రటరీగా పోలే ఎలేష్, ఆర్గనైజింగ్ సెక్రటరీగా క్రాంతి కుమార్, కోశాధికారిగా యనమల్ల వెంకన్న, ఎగ్జిక్యూటివ్ నెంబర్ గా ఎ ప్రశాంత్ , శంకర్ నాయక్ పవన్ ఐవీఎం శంకర్ నాయక్, లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆనంద్ బాబు, బిక్షపతి లు ఎన్నికల అధికారిగా వ్యవహరించారు.ఈ సందర్భంగా నూతన అధ్యక్ష,కార్యదర్శులు మాట్లాడుతూ తమ ఎన్నికకు సహకరించిన ఎలక్ట్రిసిటీ ఉద్యోగులకు ధన్యవాదాలు తెలియజేస్తూ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తామని తెలిపారు. అదేవిధంగా అసోసియేషన్ అభివృద్ధి కోసం ప్రతి ఒక్కరు సహాయ సహకారాలు అందించాలని కోరారు. ఉద్యోగులు ఐకమత్యంతో తమ హక్కులను సాధించుకోవాలని పిలుపునిచ్చారు.

## ఎస్‌సి బాలికల వసతి గృహంలో విద్యుత్ మరమ్మతులు

**ప్రజాపక్షం/చండూరు:** చండూరు మున్సిపల్ కేంద్రంలోని ఎస్సీ బాలికల వసతి గృహంలో సరిపడా లైట్లు లేక చీకటిగా ఉందనే విషయం లేలుసుకున్న బిజెపి చండూరు మున్సిపల్ పట్టణ అధ్యక్షుడు పందుల సత్యంగౌడ్ తన సొంత ఖర్చులతో విద్యుత్ మరమత్తుల తో పాటు వైరింగ్ నూతన లైట్ల ఫింటింగ్ చేయించారు. ఈ సందర్భంగా పందుల సత్యంగౌడ్ మాట్లాడుతూ రాత్రి పూట లైట్లు సరిగా లేని కారణంగా ఆడ బిడ్డలు భయబ్రాంతులకు గురవుతుండటం, వార్షాకాలం కావడంతో విషపూరిత జీవులు సంచరించే సమయం కావడంతో సమస్యలను త్వరగా పరిష్కరించాలనే లక్ష్యంతో వెంటనే సొంత ఖర్చులతో పనులు చేయించానని అన్నారు.



వెంటనే స్పందించి ఎస్సీ బాలికల వసతి గృహానికి లైట్ల సమస్యలు పరిష్కరించిన పందుల సత్యంకు విద్యార్థులు ప్రత్యే కృతజ్ఞతలు తెలిపారు.

## బయో మైనింగ్ సైట్ సకాలంలో పూర్తి చేయాలి

**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** నల్గొండ పట్టణంలో నూతనంగా నిర్మించిన బయో మైనింగ్ సైట్ ను సకాలంలో పూర్తి చేయాలని మున్సిపల్ కమిషనర్ సయ్యద్ ముసబ్ అహ్మద్ ఏజెన్సీ నిర్వాహకులను ఆదేశించారు. పట్టణ శివారులోని పానగల్ డంపింగ్ యార్డ్లో ఏర్పాటు చేయనున్న బయో మైనింగ్ సైట్ను మంగళవారం సంబంధిత ఏజెన్సీ నిర్వహకులతో కలిసి పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలో జనాభా రోజు రోజుకు పెరిగిపోతున్నందున చెత్త కూడా అధికంగా వస్తుందన్నారు. దాన్ని ప్పటికప్పుడు శుద్ధి చేసేందుకు తగిన చర్యలు చేపట్టినట్లు తెలిపారు. అందులో భాగంగానే బయో మైనింగ్ సైట్ను కూడా ఏర్పాటు చేసేందుకు టెండర్లు పిలిచి అగ్రిమెంట్లు కూడా పూర్తి చేసినట్లు తెలిపారు. అనంతరం బయో మైనింగ్ సైటుకు సంబంధించి కావలసిన సదుపాయాలు వనరులు నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. ఎలాంటి ఇబ్బంది వచ్చినా వెంటనే సంప్రదించాలని ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ అదనపు కమిషనర్ రవీందర్ రెడ్డి శానిటరీ ఇన్స్పెక్టర్లు నంద్యాల ప్రదీప్ రెడ్డి గడ్డం శ్రీనివాస్ డీఈ కార్తీక్, ఏఈ అసీమ్ బాబా ఏజెన్సీ ప్రతినిధులు నవీన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.





## మహిళా శక్తి సంబరాలు

**ప్రజాపక్షం/యాదాద్రి :** మహిళా శక్తి సంబరాలలో భాగంగా మంగళవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో యాదాద్రి భువనగిరి జిల్లాలోని అన్ని మున్సిపాలిటీల మున్సిపల్ కమిషనర్లు, మెప్మా సిబ్బంది, రిసోర్స్ పర్సన్లు (ఆర్‌పిలు)తోస్థానిక సంస్థలు అదనపు కలెక్టర్ భాస్కర్ రావు అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ఇందిరమ్మ సంబరాల్లో భాగంగా జిల్లాలోని ప్రతి మున్సిపాలిటీలో మహిళా సంఘాల సమావేశాలు, కళాజాత కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. ఇందిరమ్మ గృహ నిర్మాణ పథకం కింద లబ్ధిదారులను తక్షణమే గుర్తించి, అవసరమైన బ్యాంక్ లోన్లు, శ్రీనిధి మరియు సిఐఎఫ్ నిధుల ద్వారా ఆర్థిక సహాయం కల్పించి, గృహ నిర్మాణాలను వేగంగా పూర్తి చేయాల్సిన అవసరం ఉందని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధి కారి నాగిరెడ్డి, మున్సిపల్ కమీషనర్లు, మెప్మా సిబ్బంది పాల్గొన్నారు.

## సిఎం సహాయ నిధి వరం



**ప్రజాపక్షం/చండూరు :** సీఎం సహాయ నిధి పథకాన్ని అర్హులైన ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని మాజీ చండూరు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు , బంగారిగడ్డ మాజీ ఎంపిటిసి పల్లె వెంకన్న అన్నారు. మునుగోడు ఎంఎల్‌ఎ కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి సహకారంతో చండూరు మండలం బంగారిగడ్డ గ్రామానికి చెందిన పగిల్ల మల్లేశంకు 68వేలు , మేడిపల్లి ప్రణయ్‌కు 16వేలు రూపాయల సీఎం రిలీఫ్ చెక్కులను మంగళవారం బంగారిగడ్డలో లబ్ధిదారులకు పల్లె వెంకన్న అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాగ్రెస్ పార్టీ మాజీ కార్యదర్శి ఇరిగి రాజు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు సుంకరి నర్సింహ్మా, ఎఎంసి డైరెక్టర్ తలారి నర్సింహ్మా, దేవాలయ కమిటీ డైరెక్టర్ బోయపల్లి రాములు , సుంకరి శివనారి, బోయపల్లి సైదులు పాల్గొన్నారు.

## కార్యకర్తకు కూనంనేని ఎల్‌ఓసి



**ప్రజాపక్షం/డిండి :** డిండి మండలంలోని తవక్లాపూర్ సిపిఐ గ్రామశాఖ కార్యకర్త భయ్యా శ్రీను కుమారుడు భయ్యా వంశీ చైతన్య కీళ్ల నొప్పులతో బాధపడుతుండగా మెరుగైన చికిత్స ఖర్చుతో కూడుకోవడంతో మంగళవారం సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగుడెం ఎంఎల్‌ఏ కూనంనేని సాంభశివరావు నుకలిసి విషయం చెప్పగా అనారోగ్యంతో బాధపడుతున్న కార్యకర్త కుమారునికి మెరుగైన చికిత్స కోసం రూ. 2,50,000 విలువ గల ఎల్‌ఓసి మంజూరు చేసి పార్టీ కార్యకర్త కుటుంబానికి భరోసా కల్పించారు. సంబంధిత ఎల్‌ఓసిని గిరిజన సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమావత్ అంజయ్యానాయక్ చేతుల మీదుగా భయ్యా శ్రీనుకు అందజేశారు. కుమారుని వైద్యం కోసం భరోసా నిచ్చిన ఎంఎల్‌ఏ సాంబశివరావుకు శ్రీను ధన్యవాదాలు తెలిపారు. ఈకార్యక్రమంలో సిపిఐ తవక్లాపూర్ గ్రామశాఖ కార్యదర్శి వంకేశ్వరం చక్రి, సహాయ కార్యదర్శి ఎనమల్ల నవీన్ పాల్గొన్నారు.

# పేదల పెన్నిధి వైఎస్ఆర్



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ**: పేదల పెన్నిది మాజీ ఎమ్మెల్యే వైఎస్.రాజశేఖర్‌రెడ్డి అని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి, ఎమ్మెల్సీ కెతావత్ శంకర్‌నాయక్‌లు అన్నారు. మంగళవారం రాజశేఖర్‌రెడ్డి జయంతిని పురస్కరించుకోని బంగారుగడ్డలో ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించి కేక్‌ను కట్ చేసి కార్యకర్తలకు పంచారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు చిరుమర్రి కృష్ణయ్య, పట్టణ అధ్యక్షులు నూకల వేణుగోపాల్‌రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి చిలు కూరు బాలు, మాజీ కౌన్సిలర్లు శేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.



**ప్రజాపక్షం/మునగాల:** దివంగత ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి 76వ జయంతి వేడుకలను మంగళవారం మునగాల కాంగ్రెస్ పార్టీ నాయకులు, అభిమానులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలోని వైఎస్సార్ విగ్రహనికి పూలమాలలువేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు కాసర్ల కోటేశ్వరరావు, చింతకాయల నాగరాజు, అక్కినపల్లి రవి, మండవ శ్రీను, పసుపులేటి గోపి, గుండు నాగేశ్వరరావు, గంధం సైదులు పాల్గొన్నారు.



**ప్రజాపక్షం/కోదాడ:** దివంగత మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి పేద ప్రజల గుండెల్లో నేటికి చిరస్థాయిగా నిలిచిపోయారని కాంగ్రెస్‌పార్టీ సీనియర్ నాయకులు ఏర్నేని వెంకటరత్నంబాబు అన్నారు. మంగళవారం వైఎస్సార్ జయంతి సందర్భంగా ఆయన విగ్రహనికి పూలమాలలువేసి ఘనంగా నివాళుర్పించారు. ఈ కార్యక్రమంలో చందు నాగేశ్వర రావు, నెమ్మాది ప్రకాశ్‌బాబు, దేవమణి, రావెళ్ల కృష్ణారావు, గంధం పాండు పాల్గొన్నారు.



**ప్రజాపక్షం/ రామన్నపేట**: మండల కేంద్రంలో మాజీ సీఎం వైఎస్ఆర్ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు కాంగ్రెస్ నాయకులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు మొహమ్మద్ జమీరొద్దిన్, జిల్లా కాంగ్రెస్ నాయకులు గంగుల వెంకటరాజిరెడ్డి, గోదాసు పృధ్వీరాజ్, వనం చంద్రశేఖర్, జెల్లా వెంకటేశం, సాల్వేరు లింగం, కొత్తపల్లి అబ్రహంకుమార్ ఉన్నారు.

**ప్రజాపక్షం/నార్కట్‌పల్లి:** ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి జయంతి సందర్భంగా మంగళవారం మండలంలోని బ్రహ్మణ వెల్లెంల వైఎస్ఆర్ పార్క్‌లో ఆయన విగ్రహానికి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బత్తుల ఉషయ్య పూలమాలవేసి ఘన నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ చిరుమర్తి ధర్మయ్య, నాయకులు చిరుపెల్లి రఘుపతి, మైల యాదయ్య,మంద లింగయ్య,మేడి వెంకన్న,ఈపూరి నరసింహ తదితరులు పాల్గోని నివాళులు అర్పించారు.

**ప్రజా పక్షం /నల్లగొండ టౌన్** : స్వర్గీయ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి వైయస్ రాజశేఖర్



రెడ్డి జయంతి వేడుకలను పురస్కరించుకొని పట్టణం లోని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి క్యాప్ కార్యాలయంలో మంగళవారం ఆయన చిత్రపటానికి కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు గుమ్ముల మోహన్ రెడ్డి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ అబ్బగోని రమేష్ గౌడ్,మార్కెట్ కమిటీ చైర్మన్ జూకూరి రమేష్,మాజీ జెడ్పిటిసి వంగూరి లక్ష్మయ్య, మాజీ కౌన్సిలర్లు పాల్గొన్నారు.

**ప్రజాపక్షం/మోతె**: దివంగత మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్సార్ 76వ జయంతి వేడుకలను మండల



పరిధిలోని సిరికొండ గ్రామంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రాజశేఖర్‌రెడ్డి విగ్రహనికి పూలమాలలువేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో నాయకులు నందిగామ కృష్ణారెడ్డి, సతీష్‌బాబు, వెంకటరెడ్డి, మధుసూదన్, వెంకటేష్ పాల్గొన్నారు.

**ప్రజాపక్షం/వలిగొండ** : వలిగొండ మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మంగళవారం



మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మండల పట్టణ అధ్యక్షులు పాశం సత్తి రెడ్డి, కంకల కిష్టయ్య పాల్గొన్నారు.

**ప్రజాపక్షం/తుర్కపల్లి** : తుర్కపల్లి మండల కేంద్రంలో కాంగ్రెస్ నాయకులు వైఎస్ రాజశేఖర్ రెడ్డి చిత్రపటా



నికి పూలమాలలు వేసి ఘననివాలు అర్పించారు. ఈ కార్యక్రమంలో తుర్కపల్లి మండల కాంగ్రెస్ నాయకులు బోయిని మహిపాల్, మండల కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి కోట సురేష్, కూరేళ్ల బాలకృష్ణ, బండారి శ్రీను పాల్గొన్నారు.

**ప్రజాపక్షం/చౌటుప్పల్** :దివంగత ఉమ్మడి రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి ప్రజా నాయకుడు డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి 76వ జయంతి పురస్కరించుకుని మంగళవారం చౌటుప్పల్ పట్టణ కేంద్రంలోని రాజీవ్ స్మారక భవనములో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో రాజీవ్ స్మారక ట్రస్ట్ ప్రధాన కార్యదర్శి ఎండి ఖయ్యాం, చౌటుప్పల్ మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ అధ్య



క్షులు సుర్వి నరసింహ గౌడ్, ఐఎన్‌టియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోయ రామచందర్, రాజీవ్ స్మారక



ఆర్గనైజర్ నల్ల నరసింహ, ఓబిసి మున్సిపల్ అధ్యక్షులు ఆవుల యేసు యాదవ్ పాల్గొన్నారు.

**ప్రజాపక్షం/దేవరకొండ;** ప్రజా సంక్షేమానికి కొత్త నిర్వచనం ఇచ్చి, పేదవాడి జీవితానికి భరోసా ఇచ్చి, తెలుగు ప్రజల హృదయాల్లో చెరగని ముద్ర వేసిన డా. వైఎస్ రాజశేఖర్‌రెడ్డి 76వ జయంతి సందర్భంగా పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులోని ఎంఎల్‌ఏ



నివాసంలో డా. వైఎస్ రాజశేఖర్‌రెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

**ప్రజాపక్షం/మునుగోడు:** ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ రాజశేఖర్ రెడ్డి 76వ జయంతి సందర్భంగా మంగళవారం మునుగోడు మండల కేంద్రంలో మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు ఈ సందర్భంగా కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో చండూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ దోటి నారాయణ, కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు భీమనపల్లి సైదులు, చండూర్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ కుంభం చెన్నా



రెడ్డి,బూడిద లింగయ్య యాదవ్,పాల్వాయి గోవర్ధన్ రెడ్డిపాల్గొన్నారు.

**ప్రజాపక్షం /హాలియా:** దివంగత మాజీ ముఖ్యమంత్రి వైఎస్ఆర్ జయంతి వేడుకలనుహాలియాలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కుందూరు వెంకట్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. మంగళవారం వైఎస్ ఆర్ 76వ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ సలహాదారు పిల్ల ఆంజనేయులు, మాజీ ఉప సర్పంచ్ పాంపాటి శ్రీనివాస్, మైనార్టీ నియోజకవర్గ అధ్యక్షుడు మజహార్ మొయినుద్దీన్ పాల్గొన్నారు.

**ప్రజాపక్షం/చిట్యాలః** ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, కాంగ్రెస్ నేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి 76వ జయంతి కార్యక్రమాన్ని నల్లగొండ జిల్లా చిట్యాల పట్టణంలో కాంగ్రెస్ నాయకులు ఘనంగా జరుపుకున్నారు. ఆయన చిత్రపటానికి నాయకులు నివాళులు అర్పించారు. నివాళులు అర్పించిన వారిలో మున్సిపల్ మాజీ చైర్మన్ కోమటిరెడ్డి చినవెంట్‌రెడ్డి, జిల్లా కాంగ్రెస్ నాయకులు పోకల దేవదాసు, పట్టణ శాఖ అధ్యక్షులు జడల చినమల్లయ్య, నాయకులు షేక్ ఇబ్రహీం, సాగర్ల గోవర్ధన్ ఉన్నారు.



## గురుకుల కళాశాలలో అతిథి అధ్యాపకులు దరఖాస్తు

**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని మహాత్మ జ్యోతిబాపూలే బిసి గురుకుల కళాశాలల్లో ఆంగ్ల మాధ్యమంలో బోధించేందుకు అతిథి అధ్యాపకుల నియామకాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు బీసీ గురుకులాల ఆర్‌సిఓ స్వప్న తెలిపారు.తెలుగు,ఇంగ్లీష్, బాటనీ,సివిక్స్, ఎకనామిక్స్, కామర్స్ సబ్జెక్టులకు మహిళా అభ్యర్థులు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలని, అలాగే ఫిజికల్ సైన్స్, కెమిస్ట్రీ, జూవాలజీ, మైక్రోబయాలజీ వంటి సబ్జెక్టులకు బోధించగల అర్హత కలిగిన జనరల్ అభ్యర్థులు పురుషులు,మహిళలు దరఖాస్తు చేసుకోవాలని ఈ అవకాశాన్ని అర్హులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అభ్యర్థులు సంబంధిత సబ్జెక్టుల్లో పీజీ పోస్ట్ గ్రాడ్యుయేషన్ పూర్తిచేసి, కనీసం 55 శాతం మార్కులతో ఉత్తీర్ణత సాధించి ఉండాలని పేర్కొన్నారు. అభ్యర్థులు తమ దరఖాస్తులను నేటి నుండి ఈ నెల 12వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. పట్టణంలోని మహాత్మా జ్యోతి బాపులే బీసీ బాలికల పాఠశాల రెడ్డి హాస్టల్ దేవరకొండ రోడ్‌లో ఉదయం 9:00 గంటల నుండి సాయంత్రం 5:00 గంటల వరకు స్వయంగా సమర్పించవచ్చని పేర్కొన్నారు. తదుపరి ఎంపిక ప్రక్రియ సబ్జెక్టుల వారీగా నిర్వహించబడుతుందని, సంబంధించిన సమాచారం అభ్యర్థుల మొబైల్ నెంబర్లకు పంపబడుతుందని, మరిన్ని వివరాల కోసం 8682231833 నెంబర్ ను సంప్రదించవచ్చని తెలిపారు.

## ప్రింటర్, కుర్చీలు పంపిణీ



**ప్రజాపక్షం/భువనగిరి రూరల్** : భువనగిరిలోని ఆర్కే హాస్పిటల్ చావా ఫౌండేషన్ ఆధ్వర్యంలో బీసీ వెల్ఫేర్ రెసిడెన్షియల్ డిగ్రీ కళాశాల విద్యార్థులకు కుర్చీలు, ప్రింటర్ను చావ ఫౌండేషన్ అధినేత డాక్టర్ రాజకుమార్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ఏకాగ్రతతో ఉన్నత చదువులు చదివి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలి అన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ అశ్లేష, కళాశాల ఇన్చార్జ్ వైస్ ప్రిన్సిపల్ నరేష్, అధ్యాపకులు కవితా, స్వాతి, మహేష్, చంద్రశేఖర్, పాపన్న, అనురాధ, భువన తదితరులు పాల్గొన్నారు.

## పరామర్శ, ఆర్థిక సహాయం



**ప్రజాపక్షం/మోటకొండూర్:** మోటకొండూర్ మండలంలోని కొండాపూర్‌లో ఇటీవల ప్రమాదవశాత్తు ట్రాక్టర్ పల్టీ కొట్టి గాయాలపాలైన గుడ్డేటి చందును, ఇటీవల మృతి చెందిన మొగులగాని సత్తమ్మ కుటుంబ సభ్యులను కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు యెల్లంల సంజీవరెడ్డి పరామర్శించారు. అనంతరం చందు కుటుంబ సభ్యులను ఆరోగ్య పరిస్థితి అడిగి తెలుసుకుని రూ.5 వేలు ఆర్థిక సహాయం అందించారు. మొగులగాని సత్తమ్మ కుటుంబ సభ్యులకు 50 కిలోల బియ్యం అందించారు. గ్రామ శాఖ అధ్యక్షులు కొప్పుల ఉపేందర్ రెడ్డి, మండల కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు చాడ శశిధర్ రెడ్డి, ఫైళ్ల విఠల్ రెడ్డి, గ్రామ మాజీ సర్పంచ్ పెంటయ్య, మల్లారెడ్డి, సత్తిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## వ్యాస రచన పోటీలు

**ప్రజాపక్షం/ఆత్మకూర్ (యం)** ః వయోదికులపై వేదింపులు నివారణ సంరక్షణ అనే అంశం పై సీనియర్ సిటిజన్స్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు వ్యాస రచన పోటిలు నిర్వహించినారు. విజేతలైన వారికి జిల్లా కేంద్రంలో కలెక్టర్ చేతులమీదుగా బహుమతులు ఇవ్వనున్నారు. యంఇఓ కొత్త మహాదేవ రెడ్డి, సీనియర్ సిటిజన్స్ జిల్లా అధ్యక్షులు ప్రతికంఠం పూర్ణచందర్ రాజు, పాఠశాల ఉపాధ్యాయులు మజ్జిగ లక్మణ్, అశోక్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు



## వైయస్ జయంతి వేడుకలు

**ప్రజాపక్షం/భువనగిరి :** మాజీ ఉమ్మడి రాష్ట్ర ముఖ్య మంత్రి దివంగత ప్రజా నాయకుడు డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి జయంతి సందర్భంగా పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కూర వెంకటేష్ ఆధ్వర్యంలో ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కూర వెంకటేష్, మాజీ మున్సిపల్ చైర్మన్ పోతంశెట్టి వెంకటేష్, బర్రె జహంగీర్, కుక్కదూగు సోమయ్య, ఎండి మజహర్, పిట్టల బాలరాజ్, ఇరపాక నరసింహ, ఎండి సలావుద్దీన్, గుర్రాల శ్రీనివాస్, ఎండి లైక్ అహ్మద్ పాల్గొన్నారు.

**ప్రజాపక్షం/సూర్యాపేటటౌన్:** దివంగత ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి 76వ జయంతిని సూర్యాపేట జిల్లా కేంద్రంలో మైనార్టీ నాయకులు ఘనంగానిర్వహించారు. ఈ సందర్భంగా వైఎస్సార్ విరాభిమాని సాజిద్ ఆధ్వర్యంలో వైఎస్సార్ చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ అభిమానులు ఎండిగౌస్, వసీం, రహీం, కిరణ్, రవీందర్‌రెడ్డి, కనుకు ప్రసాద్, రియాజ్ పాల్గొన్నారు.





## విద్యార్థి నక్షత్రకు ప్రతిభ పురస్కారం

**ప్రజాపక్షం/మానవపాడు:** జోగులాంబ గద్వాల జిల్లా అలంపూరు నియోజకవర్గం మానవపాడు మండలం మండల పరిధిలో ఉన్న జెడ్పిహెచ్ఎస్ హై స్కూల్‌లో నక్షత్ర అనే అమ్మాయి గత సంవత్సరంలో 10వ తరగతిలో మానవపాడు మండల స్థాయిలో ఉత్తమ ఫలితాల భాగంలో 520 మార్కులు సాధించి నక్షత్ర అనే విద్యార్థికి గద్వాల కోట కాలేజీలో ఎంఎఎల్‌డి కళాశాలలో జై నడిగడ్డ యువత కమిటీ మండల అధ్యక్షుడు శాంతకుమార్ ఆధ్వర్యంలో నక్షత్ర అనే విద్యార్థికి ప్రతిభ పురస్కారం అందించడం జరిగింది. ఈ కార్యక్రమంలో 10వ బెటాలియన్ కమాండెంట్ జయరాజు 10వ బెటాలియన్ డిఎస్పి నరేందర్‌రెడ్డి, జిల్లా అధ్యక్షులు పల్లె రాజు, అన్ని మండలాల అధ్యక్షులు పల్లె రాజు, అన్ని మండలాల అధ్యక్షులు శాంతకుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## పరీక్షలతో టిబి వ్యాధులను గుర్తించవచ్చు

ప్రజాపక్షం/ఉండవెల్లి: క్షయ వ్యాధిగ్రస్తులను గుర్తించేందుకు పరీక్షలు తప్పనిసరి పరీక్షించుకుని ప్రభుత్వం అందించే ఉచిత మందులను ఉపయోగించుకోవాలని గద్వాల జిల్లా ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ రాజు అన్నారు. మంగళవారం టిబి ముక్తిభారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా రోగులను పరీక్షించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అనారోగ్యాలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న వారు దీర్ఘవ్యాధిగ్రస్తులు వారు పరీక్షించుకోవాలని వారు తెలిపారు. పొగత్రాగే వారు మద్యం సేవించేవారు షుగర్‌వ్యాధి వారు ఇతర వ్యాధి గల వారు కూడా పరీక్షలు చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ డా.హేమ మానస హెల్త్ విజిటర్ కిరణ్ కుమార్, హెల్త్ సూపర్‌వైజర్స్ గురుబసయ్య, చంద్రన్న, ఏఎన్‌ఎం లో దేవమ్మ, జయమ్మ, ఆశలు పాల్గొన్నారు.

## మరువలేని నాయకుడు వైఎస్ఆర్ : పాయం

**ప్రజాపక్షం/మణుగూరు:** తెలుగు ప్రజలు ఎవరు, ఎప్పటికీ మరచిపోలేని నాయకుడు దివంగత ముఖ్యమంత్రి వైయస్ రాజశేఖర్ రెడ్డి అని పినపాక శాసనసభ్యులు పాయం వెంకటేశ్వర్లు అన్నారు. మణుగూరు మండల ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం, ప్రజా భవన్ నందు దివంగత నేత, తెలుగు ప్రజలు మరవలేని, మరిచిపోని మహా నాయకులు డాక్టర్ వైఎస్. రాజశేఖర్ రెడ్డి జయంతి వేడుకల్లో ఆయన పాల్గొని వైఎస్సార్ చిత్రపటానికి నివాళులర్పించిన అనంతరం ఆ మహనీయుని తలుచుకుంటూ మాట్లాడారు. డాక్టర్ అని, మొహం మీద చెరగని చిరునవ్వుతో, ఆప్యాయమైన పలకరింపుతో, అందరితో కలిసి పోయే తత్వంతో, మృదు భాషణంతో, నీగర్వంతో, సహనంతో, సమయస్ఫూర్తితో ఇలా అన్నీ కలిపితే ఆయనే వర్యులు వైయస్ రాజశేఖర్ రెడ్డి అని తెలిపారు. సోనియా గాంధీ నాయకత్వంలో వారు ముఖ్యమంత్రిగా పనిచేస్తూ ఎన్నో మహోత్తరమైన పథకాలను ప్రవేశపెట్టారని ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఆనాటికి టీడీపీ ప్రభుత్వం పెండింగ్లో పెట్టిన ప్రాజెక్టులన్నింటిని పూర్తిచేసి రైతుల



పాటీ భగీరధుడు అయ్యాడు, ఆనాటి ఉమ్మడి రాష్ట్రంలో అధిక సంఖ్యలో ఇందిరమ్మ ఇళ్ళను కట్టించి పేదవాడి గుండెల్లో నిలిచిపోయిన వ్యక్తి, 108 అంబులెన్స్ ను ప్రవేశపెట్టిన ఘనత ఆయనది, పేదవాడు కార్పొరేట్ హాస్పిటల్లో ట్రీట్మెంట్ చేయించుకోవడానికి ఆరోగ్య శ్రీ పథకాన్ని ఇలా మరెన్నో మహోత్తరమైన పథకాలను ప్రవేశపెట్టిన మహనీయులు అని అన్నారు. ముక్కు సూటితత్వం ఆయన తత్వం, బెదరడం తెలవని వ్యక్తి. అవినీతి, బంధుప్రీతి, అహంకారం, స్వార్థం లేని వ్యక్తిగా ప్రజలందరికీ గుండెల్లో నిలిచిపోయిన వ్యక్తి వైఎస్. రాజశేఖర్ రెడ్డి అన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు పీరినాకి నవీన్, టౌన్ అధ్యక్షులు శివ సైదులు, పినపాక నియోజకవర్గం యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు తరుణ్ రెడ్డి, మణుగూరు శివాలయం చైర్మన్ కూచిపూడి బాబు, మండల మహిళా కాంగ్రెస్ అధ్యక్షులు సౌజన్య, అనుబంధ సంఘాల నాయకులు, మండల ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## పాఠశాల ఏర్పాటుకు స్థల పరిశీలన

**ప్రజాపక్షం/పాల్వంచ :** మండల పరిధి బండ్రుగొండ పంచాయితి కోయగట్టు ఆదివాసీ గ్రామంలో ప్రభుత్వ పాఠశాల ఏర్పాటుపై కోయగట్టు గ్రామాన్ని మండల విద్యాశాఖ అధికారి శ్రీరామమూర్తి మంగళవారం సందర్శించారు. ఈ సంధర్భంగా గ్రామస్థులతో కలిసి స్థలాన్ని పరిశీలించారు. పక్కా భవనాలు లేకపోవటంతో తాత్కాలిక ఏర్పాటుకు ఓ పూరి గుడిసెను ఎంపిక చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ... ప్రభు త్వం గ్రామానికి పాఠశాలను మంజూరు చేసిందన్నారు. వారం రోజుల లోపు ఉపాధ్యాయుడిని కేటాయించి ఉన్నతాధికారులతో పాఠశాలను ప్రారంభిస్తామని తెలిపారు. ఎంఈఓ వెంట సిఆర్‌పి శ్రీనివాస్, ఉపాధ్యాయులు సుధాకర్, రమేష్, భిక్షం తదితరులు పాల్గొన్నారు.

## సెయింట్ విన్సెంట్ స్కూల్ గోడౌన్ సీజ్

**ప్రజాపక్షం/ ఎర్రుపాలెం :** రాష్ట్రంలో విద్యా సంవత్సరం ప్రారంభమైన నేపథ్యంలో ప్రైవేట్ కార్పొరేట్ విద్యాసంస్థల్లో విచ్చలవిడిగా ఫీజుల దోపిడికి పాల్పడుతున్నట్లు, జిల్లా విద్యాశాఖ అధికారులు ఫీజుల దోపిడికి పాల్పడుతున్న విద్యాసంస్థల యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని ఎఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు మడుపల్లి లక్ష్మణ్ డిమాండ్ చేశారు. మంగళవారం ఎర్రుపాలెం మండల సమితి ఆధ్వర్యంలో సెయింట్ విన్సెంట్ విద్యాసంస్థల అధిక ఫీజులు తగ్గించాలని, నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్న స్కూల్ గోడౌన్‌ను సీజ్ చేయాలని ఆందోళన నిర్వహించారు. ఈ విషయం తెలుసుకున్న ఎంఇఓ మురళీ మోహన్‌రావు అక్కడికి చేరుకుని నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్న స్కూల్ గోడౌన్‌ను సీజ్ చేశారు. ఈ సందర్భంగా లక్ష్మణ్ మాట్లాడుతూ ప్రైవేట్ కార్పొరేట్ పాఠశాలల్లో ఫీజుల పేరుతో వసూలు దందా కొనసాగిస్తున్నారని, విద్యను అంగడి సరుకుగా మార్చేసి అడ్మిషన్ తీసుకోవాలంటే డొనేషన్లు, యూనిఫామ్, ఐఐటి ఫౌండేషన్, బుక్స్‌కు సపరేటు ఫీజులు అంటూ ఇలా రకాల రకాల కోర్సులు బ్రోచర్స్‌తో అడ్డగోలుగా ఫీజులు వసూలు చేస్తున్నారన్నారు. అయినా ప్రభుత్వం మాత్రం చోద్యం చూస్తుందే తప్ప ఫీజుల నియంత్రించడంలో వైఫల్యం చెందిందన్నారు. ఇప్పటికైనా జిల్లా విద్యాశాఖ అధికారులు ప్రైవేట్ కార్పొరేట్ విద్యాసంస్థలపై దాడులు నిర్వహించి అనుమతి లేని విద్యాసంస్థలను తక్షణమే సీజ్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు ఉగ్గం సురేష్, మండల నాయకులు సాయి మణికంఠ, నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



## గుంతలమయంగా మారిన రోడ్లకు మరమ్మతులు చేయాలి

**ప్రజాపక్షం/ రామన్నపేట:** మండల వ్యాప్తంగా అస్తవ్యస్తంగా నరక కూపాలుగా ఉన్న రోడ్లకు వెంటనే ఆర్అండ్‌బీ అధికారులు మరమ్మతులు చేయాలని, అన్ని గ్రామాలకు ఆర్టీసీ బస్సులను పునరుద్ధరించాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు జల్లెల పెంటయ్య డిమాండ్ చేశారు. స్థానిక సీపీఎం కార్యాలయంలో కూరెళ్ల నరసింహాచారి అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. మండల వ్యాప్తంగా గత సంవత్సరం కురిసిన వర్షాలకు రోడ్లు ధ్వంసమై గుంతలమయంగా మారి ప్రయాణీకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. అమ్మనబోలు, వేములకొండ రోడ్లలో బస్సులు పునరుద్ధరింకపోవడంతో విద్యార్థులు విద్యకు దూరమవుతున్నారని అన్నారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి బొడ్డుపల్లి వెంకటేశం, మండల కార్యదర్శివర్గ సభ్యులు బల్గూరి అంజయ్య, బోయిని ఆనంద్, కల్లూరి నాగేష్, మండల కమిటీ సభ్యులు గన్నబోయిన విజయభాస్కర్, గొరిగె సోములు, బావండ్లపల్లి బాలరాజు, నాగటి ఉపేందర్, గాదె నరేందర్, ఎండి.రషీద్, వేముల సైదులు, తొలుపునూరి శ్రీనివాస్, మేడి గణేష్, ఆవనగంటి నగేష్ తదితరులు ఉన్నారు.




## బియ్యం పంపిణీ

**ప్రజాపక్షం/తుర్కపల్లి :** మండల కేంద్రంలో ఇటీవల మరణించిన పుట్ట ఐలయ్య, తలారి ఎల్లమ్మ కుటుంబాలకు తుర్కపల్లి కాంగ్రెస్ పార్టీ మాజీ మండల అధ్యక్షురాలు బోరెడ్డి జ్యోతి అయోధ్య రెడ్డి 50 కిలోల చొప్పున బియ్యాన్ని ఆ రెండు కుటుంబాలకు అందచేశారు. వారి కుటుంబాలకు ప్రగాఢ సంతాపాన్ని తెలిపారు. ఈ కార్యక్రమంలో తుర్కపల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి కోట సురేష్, కాంగ్రెస్ నాయకులు బోయిని మహిపాల్, కూరేళ్ల బాలకృష్ణ, బండారి శ్రీను, నాగపురి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.



## దేశ్‌ముఖీ సాయినగర్ పెద్ద అంబర్ పేట్‌లో విలీనం

**ప్రజాపక్షం/భూదాన్ పోచంపల్లి :** భూదాన్ పోచంపల్లి మండల పరిధిలోని సాయి నగర్ గ్రామపంచాయతీ పెద్ద అంబర్ పేట మున్సిపాలిటీలో విలీనం చేసినట్లు ఎంపీడీవో రాపర్తి భాస్కర్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రస్తుతం దేశ్ ముఖి ఎంపీటీసీ పరిధి యందు దేశ్ ముఖి గ్రామపంచాయతీ మాత్రమే కలదనీ మంగళవారం ఎంపీటీసీ స్థానముల ముసాయిదా జాబితా ప్రచురించినట్లు మంగళవారం తెలిపారు. ఈ జాబితాపై ఏవైనా అభ్యంతరములు ఉన్నచో నేడు మండల పరిషత్ కార్యాలయంలో తెలియజేయాలని కోరారు. రెండు రోజులు అభ్యంతరాలను పరిశీలించి ఈ నెల 12న తుది జాబితాను ప్రచురించనున్నట్లు పేర్కొన్నారు.

## బిఎల్ఓలకు శిక్షణ కార్యక్రమం

**ప్రజాపక్షం/డిండి;** ముక్స్రాయి అధికారులకు జాతీయస్థాయి శిక్షణ కార్యక్రమంలో భాగంగా మంగళవారం డిండి మండల పరిషత్ కార్యాలయంలో బిఎల్‌వోలకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి దేవరకొండ ఆర్డీవో రమణారెడ్డి హాజరుకాగా శిక్షకులుగా గోవర్ధన్‌రావు, శేఖర్ తదితరులు హాజరై బిఎల్‌వోలకు శిక్షణ అందించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ ఆంజనేయులు, కార్యాలయ సిబ్బంది, బిఎల్‌వోలు పాల్గొన్నారు.



## సార్వత్రిక సమ్మెకు ప్రజా సంఘాలు కలిసి రావాలి

**ప్రజాపక్షం/వేములపల్లి:** దేశవ్యాప్తంగా నేడు జరగనున్న సార్వత్రిక సమ్మెకు ప్రజాసంఘాలు కలిసి రావాలని సిపిఐ మండల కార్యదర్శి జిల్లా యాదగిరి పిలుపునిచ్చారు.మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కార్మిక కర్షక రైతాంగ విధానాలకు వ్యతిరేకంగా కేంద్ర ప్రభుత్వం చేపట్టిన 10 ప్రజా వ్యతిరేక విధానాల 282 జీవోను రద్దు చేయాలని దేశవ్యాప్తంగా చేపట్టిన సార్వత్రిక సమ్మెకు ప్రజా సంఘాలు కలిసి రావాలన్నారు.

## ఊషయ్య కుటుంబ సభ్యులకు పరామర్శ

**ప్రజాపక్షం/పెద్దఅడిశర్లపల్లి:** పీఏ పల్లి మండల కేంద్రానికి చెందిన కాంగ్రెస్ పార్టీ కార్యకర్త నారాయణ దాసు ఉషయ్య గత రెండు రోజుల క్రితం అనారోగ్య కారణంగా మృతి చెందాడు.దాంతో అతని కుటుంబ సభ్యులను మంగళవారం దేవరకొండ శాసనసభ్యుడు నేనావత్ బాలు నాయక్ మండల నాయకులతో కలిసి పరామర్శించారు.మృతికి గల కారణాలను అడిగి తెలుసుకుని ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.ఆయన వెంట మాజీ ఎంపీపీ తేరా సత్యనారాయణ రెడ్డి,కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు వీరబోయిన యల్లయ్య యాదవ్,మండల పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ నెర్మటి సతీష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# ప్రజల పక్షాన నిలిచే ఏకైక పార్టీ సిపిఐ



### మండల మహాసభలో సిపిఐ జిల్లా కార్యదర్శి సాబీర్ పాషా



**ప్రజాపక్షం/కరకగూడెం:** ప్రజల పక్షాన నిలిచే ఏకైక పార్టీ కమ్యూనిస్టు పార్టీ అని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సిపిఐ కార్యదర్శి సాబీర్ పాషా అన్నారు. కరకగూడెం మండలం కేంద్రాల్లోని సిపిఐ పార్టీ మండల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యదర్శి షాబీర్ పాషా, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అయోధ్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వందేళ్ళ చరిత్ర కలిగిన ఏకైక పార్టీ సిపిఐ పార్టీ అని వారన్నారు. కమ్యూనిస్టులు ప్రజల పక్షాన నిలిచే పార్టీలని ప్రజల సమస్యలపై ఎవరితోటైన యుద్ధం చేయడానికి సిద్ధంగా ఉన్నామని వారు తెలిపారు. గ్రామస్థాయి నుండి పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. గ్రామాలలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి జిల్లా కి తెలియజేయాలని వాటిని పరిష్కారం అయ్యే విధంగా జిల్లా నాయకత్వం ప్రత్యేక ఉద్యమాలు చేపడుతుందని అన్నారు. గ్రామాలలో పోడు సమస్య సమస్య పోలేదని కోడు కొట్టుకున్న ప్రతి ఒక్కరికి హక్కు పత్రాలు వచ్చే విధంగా కార్యాచరణ రూపొందించాలని వారు అన్నారు. గెలిచే అంతవరకు నాయకులు చూపెట్టి గెలిచిన తర్వాతల దాని ఊసే ఎత్తడం లేదని వారన్నారు. అవినీతిలో చిక్కుకున్న నాయకులను ఊరవతలకి తరిమికొట్టాలని వారు పిలుపునిచ్చారు. ఎర్ర జెండా ప్రతి పేదోడికి అండగా ఉంటుందని అన్నారు. చివరి రక్తం బొట్టు వరకు ప్రజల సంక్షేమం కొరకు వారి అభివృద్ధికి కృషి చేస్తామని అన్నారు. ఎర్ర జెండా ఉంటేనే భూస్వాములు పెత్తందారులు ఆటలు కొనసాగవని అన్నారు. స్థానిక సంస్థలు మన ప్రాతినిధ్యం ఉండే విధంగా కార్యచరణ రూపొందించుకోవాలని ఒత్తులో భాగంగా పంచాయతీలో ఎర్రజెండా ఎగురవేయాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం మే డే స్ఫూర్తిని దెబ్బతీస్తూ 12 గంటల పని విధానాన్ని తీసుకొచ్చి కార్మికుల నడ్డి విరుస్తుందని రేపు జరిగే సార్వత్రిక సమ్మెలో సిపిఐ పార్టీ సంపూర్ణ మద్దతు తెలుపుతుందని అన్నారు. ప్రతి ఆదివాసి గ్రామాలలో అభివృద్ధిలో ఉంది అంటే దానికి ఎర్రజెండా అండగా ఉందన్నారు. గిరిజన నాయకులు గిరిజనులను నిర్లక్ష్యం చేస్తూ వారికి అభివృద్ధి ఫలాలు అందకుండా చేస్తున్నారన్నారు. అనంతరం 12 మందితో మండల నూతన కమిటీని ఎన్నుకున్నారు. కరకగూడెం మండల కార్యదర్శిగా వంగరి సతీష్, సహాయ కార్యదర్శిలుగా బోడ ముత్తయ్య, బుడుగం సతీష్, కమిటీ సభ్యులుగా 12 మందిని ఎన్నుకున్నారు. మూడోసారి మండల కార్యదర్శి ఎన్నికైన వంగరి సతీష్ ను జిల్లా నాయకులు రాష్ట్ర నాయకులు అభినందించారు. ఈ సమావేశానికి ఉన్న లక్ష్మి కుమారి, సరే రెడ్డి పుల్లారెడ్డి,మండలంలో వలస ఆదివాసీలు నాయకులు, వివిధ గ్రామాల నాయకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇండ్లకు మట్టికూపన్లు ఇవ్వాలి

### సిపిఐ మండల కార్యదర్శి గడల భాస్కర్‌రావు




**ప్రజాపక్షం/కొణిజర్ల :** నిరుపేదలకు ప్రభుత్వం మంజూరుచేసిన ఇందిరమ్మ ఇండ్లకు పునాదులవరకు కట్టుకున్న లబ్ధిదారులు మరంతోలుకాలకు మట్టిమాఫియా చాలా ఇబ్బందులు పెడుతున్నదని వారికి ప్రభుత్వం మట్టికూన్లు ఇచ్చి మట్టిమాఫియానుంచి వారికి కాపాడాలని సిపిఐ కొణిజర్ల మండల కార్యదర్శి గడల భాస్కర్‌రావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలకేంద్రం కొణిజర్లలోని దొండపాటిభవన్‌లో మంగళవారం ఆయన పత్రికా విలేకరుల సమావేశంనిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతు మండలపరిదిలోని తనికెళ్లలోని ముక్కుడుగుట్ట నుంచి వందలాది ట్రాక్టర్లతో మట్టిమాఫియా మట్టితోలకాలు జరుపుతున్నారని అదే గుట్టమీద మిషన్‌భగీరథ వాటర్‌ట్యాంక్‌లు, విద్యుత్ సబ్‌స్టేషన్‌లు ఉన్నాయని నిత్యం రాత్రింబవళ్లు వందలాది ట్రాక్టర్లతో మట్టితోలకాలు జరుపుతున్నా అధికారులు పట్టించుకోవడంలేదని అధికారులు మట్టిమాఫియాతో చేతులు కలిపారని ఆరోపించారు. కాని ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులు ఇండ్లకు మరం తోలుతుంటే మాఫియా లీడర్ ఫోన్‌చేయగానే మైనింగ్ అధికారులు వచ్చి ఇందిరమ్మ ఇండ్లకు మట్టితోలుకోకుండా అడ్డుకుంటున్నారని మాఫియాలీడర్లకు అధికారులు కొమ్ముకాస్తున్నారని విమర్శించారు. ఇదేవిధంగా కొనసాగితే మిషన్‌భగీరథ, సబ్‌స్టేషన్‌లకు ముప్పు ఏర్పడే ప్రమాదం ఉందని వాటికి ఏమైనా జరిగితే బాధ్యత ఎవరు వహిస్తారని నిలదీశారు. వైరా శాసనసభ్యులు జోక్యంచేసుకొని సమస్యను పరిష్కరించాలని అన్నారు. గుబ్బగుర్తిలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఏర్పాటు చేయాలని అన్నారు. గ్రామాల్లో వీధిదీపాలులేక ప్రజలు ఇబ్బంది పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఉపాధిహామీ కూలీలకు 200 రోజుల పనిదినాలు కల్పించాలని అన్నారు. రైతులకు పంటలుభీమా పథకం రైతుయూనిట్‌గా భీమాను చెల్లించాలని అన్నారు. తనికెళ్లనుంచి దనబండకు బిటిరోడ్డు వేయాలని పేర్కొన్నారు. పాఠశాలల్లో రెగ్యులర్ స్వీపర్‌ను ఏర్పాటు చేయాలని తెలిపారు. ఈ సమావేశంలో మండల సహాయ కార్యదర్శులు స్వర్ణ రమేష్, మనిగె కోటేశ్వరరావు, కార్యవర్గ సభ్యులు కంపసాటి వెంకన్న, తోటపల్లి సీతారాములు పాల్గొన్నారు.

## బిఎల్‌వో శిక్షణ తరగతులు



**ప్రజాపక్షం/వైరా:** వైరా మున్సిపాలిటీ పరిధిలోని ప్రభుత్వ పాఠశాలలో ఎన్నికల అధికారుల ఆదేశాల మేరకు ట్రైనింగ్ ప్రోగ్రామ్స్ కాంటాక్ట్ చేయడం జరిగిందని వైరా తహశీల్దార్ శ్రీనివాసరావు తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ త్వరలో జరగనున్న ఎన్నికల నేపథ్యంలో బూత్ లెవెల్ అధికారులు అనుసరించాల్సిన విధి విధానాలు దానికి సంబంధించిన సూచనలు సలహాలు ఈ ట్రైనింగ్ కార్యక్రమంలో ఇవ్వడం జరిగిందని తహశీల్దార్ శ్రీనివాసరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్నికల డిటి పాగి లాల్, పలువురు ఉపాధ్యాయులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# క్రీడలు మానసిక ఉల్లాసానికి దోహదం

### డాక్టర్ కాపా మురళీకృష్ణ



**ప్రజాపక్షం/వైరా:** విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో కూడా రాణించాలని క్రీడలు మానసిక ఉల్లాసాన్ని కలిగిస్తాయని శారీరక ధృఢత్వానికి ఉపయోగపడతాయని లయన్స్‌క్లబ్ ఆఫ్ డిస్ట్రిక్ట్ గవర్నర్ డాక్టర్ మురళీకృష్ణ అన్నారు. స్థానిక గుట్టబడి పాఠశాల నందు లయన్స్‌క్లబ్ అధ్యక్షులు ఏదునూతల బుచ్చిరామారావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో మురళీకృష్ణ మాట్లాడుతూ జిల్లా గవర్నర్ మదన్మోహన్ రేపాల పుట్టినరోజును పురస్కరించుకొని వారి ధాతృత్వంతో ప్రభుత్వ పాఠశాలకు రూ.10వేలు విలువ చేసే స్పోర్ట్స్ మెటీరియల్ ఇవ్వడం చాలా అభినందనీయమని, ప్రభుత్వాలు కూడా ఆటలకు ఎంతో విలువనిస్తాయని, వాటిని విద్యార్థిని, విద్యార్థులు వినియోగించుకోవాలని ఉద్యోగాల్లో రిజర్వేషన్లు కల్పిస్తారని వాటిని వినియోగించుకోవాలని ఆయన తెలిపారు. క్రీడలు మానసిక ఉల్లాసంతో పాటు ఉత్తేజాన్ని శారీరక ధారుఢ్యం పెరుగుతుందని అన్నారు. అనంతరం కేక్ కటింగ్ చేసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి చెరుకూరి శ్రీనివాసరావు, పెనుగొండ ఉపేంద్రరావు, చింతోజు నాగేశ్వరరావు, ఏపూరి రాజారావు, కొల్లా రాంబాబు, కట్ల సురేష్, గజ్జల కృష్ణమూర్తి, పూర్ణకంటి దాసు, లక్ష్మి నారాయణ, పాఠశాల ప్రధానోపాధ్యాయులు రామడుగు శ్రీనివాసచారి, ఉపాధ్యాయుని గంగవరం గృహలక్ష్మి, కల్వలక్ష్మి, సల్మా, ఆఫీస్ సిబ్బంది యాజ కృష్ణకుమారి, సైదా, వైష్ణవి తదితరులు పాల్గొన్నారు.

# 9న దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయండి



**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్:** కార్మికుల హక్కుల పరిరక్షణ కోసం జూలై 9న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను హమాలీలు, కార్మికులు జయప్రదం చేయాలని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి సింగు నర్సింహారావు పిలుపునిచ్చారు. మంగళవారం ఏదులాపురంమున్సిపాలిటీపరిధిలోని పెద్దతండలో గల ఎస్‌డబ్ల్యూసి గోధంలో కార్మికులతో సమ్మె జయప్రదంపై సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్‌కోడ్లు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. బిఎమ్ఎస్ మినహా అన్ని కార్మిక సంఘాలు పాల్గొంటుండగా...వామపక్ష పార్టీలు, ఇండియా కూటమిలోని పార్టీలు బలపరుస్తున్నట్లు తెలిపారు. అలాగే హమాలీలు, కార్మికులకు కల్పించాల్సిన హక్కులపై వివవరించారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు గాదె లక్ష్మి నారాయణ, మున్సిపల్ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు మంద వెంకటేశ్వర్లు, నాయకులు వై. ఉపేందర్, సిహెచ్ కుమార్, కె.రవి, కె.నరేష్, యం లింగయ్య, బి. రాజయ్య, వి. వెంకటేశ్వర్లు, యన్ వెంకటేశ్వర్లు, ఇ. శ్రీను, మాధవరావు తదితరులు పాల్గొన్నారు.

# డిప్యుటేషన్‌పై ఉపాధ్యాయుల ఏర్పాటు



**ప్రజాపక్షం/కొణిజర్ల :** మండల పరిదిలోని ఎల్లన్న నగర్ గ్రామానికి జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లా విద్యాశాఖాధికారి సామినేని సత్యనారాయణ, జిల్లా కమ్యూనిటీ మొహబలైజేషన్ మానిటరింగ్ ఆఫీసర్ వై రాజశేఖర్‌రెడ్డి, మండల విద్యాశాఖాధికారి అబ్రహాంమంగళవారం ఎల్లన్ననగర్ ను సందర్శించారు. గ్రామంలో పాఠశాల లేనందున ఇతర పాఠశాలలకు కొంతమంది పిల్లలు వెళ్తున్నారు ఏపాఠశాలకు వెళ్లకుండా కొంతమంది పిల్లలు ఇంటివద్దే ఉండటాన్ని వారు గమనించారు. సత్యసాయి ట్రస్ట్ సేవా ట్రస్ట్ వారు రెండుగదులతో భవనాన్ని పాఠశాలకు నిర్మించారు. కాని ఉపాధ్యాయులు లేకపోవడంతో పాఠశాల నడవడంలేదని గుర్తించారు. జిల్లా విద్యాశాఖాధికారి వెంటనే ఇద్దరు ఉపాధ్యాయులను డిప్యూటేషన్‌పై కేటాయిస్తామని తెలిపారు. విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు నోట్ పుస్తకాలు,యూనిఫామ్ అందజేయాలని ఎంఈఓ కోరినట్లు ఆయన తెలిపారు. ఈకార్యక్రమంలో డిఎండ్‌హెచ్ఓ, ఖమ్మం డిఎం పాల్గొన్నారు.

# యూరియా కొరత లేదు

**ప్రజాపక్షం/ మధిర రూరల్ :** మధిర మండలంలో యూరియా కొరత లేదని, జూలై నెలలో 222.28టన్నులు యూరియా అవసరం ఉండగా, 205 టన్నులు యూరియా అందుబాటులో ఉందని మండల వ్యవసాయాధికారి సాయిదీక్షిత్ తెలిపారు. మంగళవారం కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రైతులు ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, గత రెండు సంవత్సరాల్లో మధిర మండలంలో ఉపయోగించిన యూనియాని దృష్టిలో ఉంచుకుని జిల్లా నుంచి రైతులకు అవసరమయ్యే యూరియాను కేటాయిస్తున్నట్లు తెలిపారు. నానో యూరియా వాడకాన్ని రైతులు ప్రోత్సహించాలని, నానో యూరియా వాడకం వలన మొక్కకు పోషకాలు ఎక్కువ మోతాదులో అందుతాయని, ఖర్చు తగ్గుతుందన్నారు.

# ఓటర్ జాబితా తయారీలో బిఎల్‌ఓల పాత్ర కీలకం




**ప్రజాపక్షం/ మధిర :** ఓటర్ జాబితా తయారీలో బిఎల్‌ఓల పాత్ర కీలకమని మధిర మండల తహశీల్దార్ రాంబాబు పేర్కొన్నారు. మంగళవారం స్థానిక టివిఎం హైస్కూల్ నందు బిఎల్‌ఓల శిక్షణా కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిధిగా పాల్గొన్నారు. ఈసందర్భంగా తహశీల్దార్ మాట్లాడుతూ బిఎల్‌ఓలు అందరూ మీ పరిధిలో గల 18 సంవత్సరాలు నిండిన వారిని ఓటరుగా నమోదు చేయాలని, ప్రతి బిఎల్‌ఓ ఫారం 6, 6ఎ, 7, 8లపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. ఓటర్ జాబితా ప్రక్రియను బిఎల్‌ఓలు సమర్థవంతంగా పనిచేసి పూర్తి చేయాలని సూచించారు. ఎన్నికల డిటి డేవిడ్ కరుణాకర్ మాట్లాడుతూ బిఎల్‌ఓ విధి విధానాలు, ఓటర్ జాబితా తయారీపై సంపూర్ణంగా అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ భానుప్రసాద్, ఎఎస్ఓ సాయి, ఎస్ ఏ వాసు, కార్యాలయ సిబ్బంది, బిఎల్‌ఓలు పాల్గొన్నారు.

# వైరాలో వైఎస్ఆర్ జయంతి



**ప్రజాపక్షం/వైరా:** వైరాలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి స్వర్గీయ డాక్టర్ వైఎస్.రాజశేఖర్‌రెడ్డి 76వ జయంతి వేడుకలు వైరా పట్టణ రాజశేఖర్‌రెడ్డి అభిమాన సంఘం బాధ్యులు పర్సా రామకృష్ణ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక రింగు రోడ్డు వద్ద వైఎస్ ఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధులు వైరా మున్సిపాలిటీ మాజీ చైర్మన్ సూతకాని జైపాల్ మాట్లాడుతూ స్వర్గీయ రాజశేఖర్‌రెడ్డి ప్రతి పేదవాడి గుండెల్లో చెరగని ముద్ర వేసుకున్నాడని అన్నారు. ఐఎన్‌టియుసి వైరా సబ్ డివిజన్ అధ్యక్షులు పర్సా రవి, వైరా పట్టణ నాయకులు దార్న రాజశేఖర్, మిట్టపల్లి నాగి, పర్సా పిచ్చయ్య, మోహన్‌రెడ్డి, ఇజ్జగాని సత్యం, పర్సా శ్రీను, గున్నాల సురేష్, రేచర్ల సత్యం, దార్న వెంకటేశ్వర్లు, మిట్టపల్లి సైదులు, దేవళ్ళ గోవిందరావు, మోదుగు లక్ష్మయ్య, కర్నాటి హనుమంతరావు, చెరుకూరి కిరణ్, దేవళ్ళ దినేష్, ఏదునూరి శ్రీను, తోటకూర వీరబాబు, పిడియాల వినోద్, షేక్ అన్వర్, ఫనితి శ్రీను, కొల్లు రమేష్, వంశీ, ఉదయ్, పున్నారావు, సిద్దు, టిల్లు మురళి తదితరులు పాల్గొన్నారు.